



ప్రజావేదిక గ్రామసభకు హాజరైన జనం


టీడీపీ సమావేశంలో పాల్గొన్న నేతలు, కార్యకర్తలు

కార్యకర్తలను చూస్తే కొండంత ధైర్యం

2019 ఎన్నికల్లో ఓటమికి వారిలో అసంతృప్తే కారణం

కార్యకర్తలకు ఎమ్మెల్యేలు, ఎంపీలు అందుబాటులో ఉండాలి

టీడీపీ శ్రేణుల సమావేశంలో చంద్రబాబు









గంగాధరనెల్లూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): 'కార్యకర్తలను చూస్తే నాకు కొండంత ధైర్యం వస్తుంది. 8 నెలలుగా పాలనలో నిమగ్నమై పార్టీ శ్రేణులతో సమావేశం కాలేకపోయా. మళ్లీ కుటుంబ సమానులైన కార్యకర్తలను కలుసుకోవడం సంతోషంగా ఉంది' అని టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు అన్నారు.గంగాధర నెల్లూరు పర్యటనలో భాగంగా బీసీ, ఎస్సీ కాలనీల్లో వాసు, వసంతమ్మలకు ఆయన పెన్షన్లను పంపిణీ చేశారు. అనంతరం ఎస్సీకాలనీలో వివిధ ప్రభుత్వ శాఖలు ఏర్పాటుచేసిన స్టాళ్లను పరిశీలించారు.అక్కడే ఏర్పాటుచేసిన ప్రజావేదికలో ప్రసంగిం...క సమీపంలోని రామానాయుడుపల్లె వద్ద శనివారం మండల టీడీపీ శ్రేణులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ '30 ఏళ్ల తర్వాత గంగాధరనెల్లూరులో టీడీపీ జెండా ఎగరేశాం. పార్టీ విజయం కోసం కార్యకర్తలు ప్రాణం పెట్టి పనిచేశారు. మీకు నేను పూర్తిగా సహకరిస్తా. ఈ నియోజకవర్గాన్ని పార్టీకి కంచుకోటగా మార్చాలి. తంబళ్లపల్లె, పుంగనూరులో కాస్త గురి తప్పాం.. తప్ప జిల్లా అంతటా టీడీపీ జెండా ఎగిరింది. మొన్నటి ఎన్నికల్లో సరిగా చేసుకుని ఉంటే పులివెందులలో కూడా మనమే గెలిచేవాళ్లం. 2014-19 మధ్య అవిశ్రాంతంగా పనిచేసి 13.5 గ్రోత్‌రేట్ సాధించాం. అయినా ఎన్నికల్లో పార్టీ ఓడిపోయిందంటే దానికి కారణం ప్రజలకు మంచి చేయకపోవడం వల్ల కాదు.. కార్యకర్తల్లో అసంతృప్తి వల్లే. మీలో అణువణువూ పసుపు రక్తం తప్ప మరోటి ఉండదు. మీతో నేను మాట్లాడకుంటే నాపై అసంతృప్తి చెందుతారు. అందుకే కార్యకర్తల కోసం సమావేశం ఏర్పాటు చేయించా. ఇక నుంచి నాకూ,కార్యకర్తలకు మధ్య దూరం ఉండదు. పర్యటనకు వెళ్లిన ప్రతిచోటా కార్యకర్తలతో సమావేశమవుతా' అన్నారు.ఎమ్మెల్యేలు, ఎంపీలు ప్రజలతో అనుసంధానం కావడంతో పాటు కార్యకర్తలకూ అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. జనసేన, బీజేపీ నాయకులతో సమన్వయం చేసుకుని ముందుకెళ్లాలన్నారు. వన్‌టైమ్ ఎంపీ, ఎమ్మెల్యేగా భావించకుండా రాజకీయాల్లో ఉన్నన్నాళ్లు ప్రజాప్రతినిధులుగా ఉండేలా పనిచేయాలని ఉద్బోధించారు.వైసీపీ నేతలకు ప్రత్యక్షంగా కానీ, పరోక్షంగా కానీ ఉపకారం ఎట్టి పరిస్థితుల్లో చేయకూడదన్నారు.వారికి ఉపకారం చేయడమంటే పాముకు పాలు పోసినట్లే. అని గుర్తించాల న్నారు.



బాబుకు స్వాగతం పలికేందుకు టీడీపీ శ్రేణుల ఉత్సాహం

నీరూచెట్టు బిల్లులను త్వరలోనే చెల్లిస్తాం

నీరూచెట్టు పెండింగ్ బిల్లులను త్వరలోనే చెల్లిస్తామని చంద్రబాబు ప్రకటించారు.టీడీపీ శ్రేణులు కూడా ఇష్టానుసారంగా కాకుండా నాయకత్వం కింద పనిచేయాలని సూచించారు.ఇక మీదట కార్యకర్తలకు, నేతలకు ఏ పనులు కావాలన్నా బూత్‌కమిటీ, గ్రామకమిటీ, మండల కమిటీ, తర్వాత జిల్లా కమిటీ ద్వారా వస్తేనే మంజూరు చేస్తామన్నారు.జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి నియోజకవర్గాల్లో సరిగా పర్యటించడంలేదన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు సీ.ఆర్.రాజన్, పెనుమూరు మండల అధ్యక్షుడు రుద్రయ్య నాయుడు పార్టీ కార్యక్రమాల్లో గతంతో పోలిస్తే ఇప్పుడు వారి జోరు తగ్గిందన్నారు. పాలసముద్రం మండల టీడీపీ అధ్యక్షుడు రాజేంద్ర అలకబూని పార్టీ కార్యక్రమాలకు హాజరుకాకుండా పోతున్నారని, అవసరమైతే నేరుగా అతని పరిస్థితి తెలుసుకుని తగిన విధంగా ముందుకు సాగాలన్నారు.

అవీ ఇవీ

- టీడీపీ కార్యకర్తల సమావేశంలో చివరగా క్లస్టర్, యూనిట్, బూత్ స్థాయిలో కృషి చేసిన శ్రేణుల పేర్లను చంద్రబాబు చదివి అభినందించడంతో చప్పట్లతో సమావేశం మార్మోగిపోయింది.
- హెలిప్యాడ్‌లో ఎమ్మెల్యే థామస్ తన ఇద్దరు కుమారులను చంద్రబాబుకు పరిచయం చేశారు.
- పెన్షన్ల పంపిణీతో పాటు సెల్వి అనే మహిళతో పాటు ఆమె మనవరాళ్ల చదువుకు, సొంతింటికి ఆర్థిక సాయం చేయడం, ప్రజావేదికలో పాల్గొనడం గురించి సీఎం చంద్రబాబు సోషల్ మీడియాలో ఫొటోలతో సహా పోస్టు చేశారు. ఆయా కార్యక్రమాల్లో పాల్గొనడం ఆనందంగా ఉందని చెప్పుకొచ్చారు.
- టీడీపీ కార్యకర్తల మీటింగులో వేదిక మీద ఇన్‌ఛార్జి మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి, ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే థామస్, పార్టీ అధ్యక్షుడు సీఆర్ రాజన్‌ల తో పాటు గతంలో నియోజకవర్గ కోఆర్డినేటర్‌గా పనిచేసిన భీమనేని చిట్టిబాబుకు కూడా అవకాశం దక్కింది.
- చంద్రబాబు బస్సులో వుండగా టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు లోపలికెళ్లి కాసేపు మాట్లాడారు.
- హెలిప్యాడ్‌లో ఎల్1, ఎల్2 విభాగాల్లో టీడీపీ నాయకులు ప్రాధాన్యతను బట్టి సీఎం చంద్రబాబును కలిశారు. ఎల్1లో ఎంపీ, ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్య నాయకులు కలవగా.. అందరి భుజాలపై చేతులేసి చంద్రబాబు పేర్లతో పలకరించడంతో వారంతా మురిసిపోయారు.

2 వేల ఎకరాల్లో ఇండస్ట్రియల్ పార్కు

- ఎన్టీఆర్ జలాశయం, కృష్ణాపురం ప్రాజెక్టుల అనుసంధానం
- అన్నక్యాంటీన్, బాలుర గురుకుల పాఠశాల ఏర్పాటుకు హామీ
- గంగాధరనెల్లూరు నియోజకవర్గానికి సీఎం చంద్రబాబు వరాలు

గంగాధరనెల్లూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): 'చిత్తూరు- తచ్చూరు హైవే పూర్తయితే చెన్నైకి 45 నిమిషాల్లో, బెంగళూరుకు ఒకటిన్నర గంటలో వెళ్లిపోవచ్చు. దానికి అనుగుణంగా చిత్తూరు- తచ్చూరు హైవే సమీపంలో ఇండస్ట్రియల్ పార్కు కోసం 2 వేల ఎకరాలను సేకరించమని కలెక్టర్‌కు చెప్పా. బయటి ప్రాంతాల నుంచి పెద్ద కంపెనీలను తీసుకొచ్చి ఇక్కడ నిరుద్యోగ సమస్య తీరుస్తా'అని సీఎం చంద్రబాబు ప్రజావేదిక పేరుతో ఏర్పాటు చేసిన గ్రామసభలో హామీ ఇచ్చారు.ఎన్టీఆర్ జలాశయం, కృష్ణాపురం ప్రాజెక్టులను అనుసంధానం చేసి సాగునీటి సమస్య లేకుండా చేస్తామన్నారు.గంగాధరనెల్లూరు నియోజకవర్గానికి బాలుర గురుకుల పాఠశాలను మంజూరు చేస్తామన్నారు. జిల్లాలో సాగు, తాగు నీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటామని, హార్టికల్చర్ పంటలు పెరిగిన నేపథ్యంలో మామిడి ఆధారిత పరిశ్రమలు నెలకొల్పి ఉపాధి సౌకర్యాలను పెంచుతామన్నారు. జీడీనెల్లూరు నియోజకవర్గ కేంద్రంలో అన్న క్యాంటీన్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. ఇన్‌ఛార్జి మంత్రి రామ్‌ప్రసాద్ రెడ్డి, ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యేలు థామస్, అమరనాథ రెడ్డి, పులివర్తి నాని, గాలి భానుప్రకాష్, గురజాల జగన్మోహన్, మురళీమోహన్,టీడీపీ జిల్లా అధ్యక్షుడు సీఆర్ రాజన్, చుడా ఛైర్‌పర్సన్ హేమలత, పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి చల్లా రామచంద్రారెడ్డి, మేయర్ అముద, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మాజీ ఎమ్మెల్యేలు సీకే బాబు, ఆర్.గాంధీ, ఏఎస్ మనోహర్, టీడీపీ నాయకులు చంద్రప్రకాష్, భీమనేని చిట్టిబాబు నాయుడు, కాజూరు బాలాజి, వైవీ రాజేశ్వరి, సప్తగిరి ప్రసాద్, ఎన్‌పీఎస్ జయప్రకాష్, నాగేశ్వరరాజు, జనసేన ఇన్‌ఛార్జి పొన్న యుగంధర్, బీజేపీ నేత జగదీశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.







జీడీ నెల్లూరు బీసీ కాలనీలో వాసుకు.... మోతరంగనపల్లెకు చెందిన మురళీశ్వర రెడ్డికి పెన్షన్ అందజేస్తూ....... ఎమ్మెల్యేల అభివాదాలందుకుంటూ

కమనీయం.... మొగిలీశ్వరుడి కల్యాణం



కల్యాణోత్సవంలో మంగళసూత్రాన్ని చూపుతున్న అర్చకుడు



బంగారుపాళ్యం,మార్చి1(ఆంధ్రజ్యోతి): బంగారుపాళ్యం మండలంలోని కామాక్షి సమేత మొగిలీశ్వర స్వామి వార్షిక ఉత్సవాల్లో ఏడవ రోజైన శనివారం పార్వతీపరమేశ్వరుల కల్యాణం అంగరంగవైభవంగా జరిగింది. ప్రధాన అర్చకులు గంగాధర గురుకుల్ ఆధ్వర్యంలో సాయంత్రం 5 గంటలకు ఆలయంలోని మూలవిరాట్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ముందుగా సకల విఘ్నాలకు అధిపతైన వినాయకుడికి పూజలు చేసి కల్యాణతంతును ప్రారంభించారు.ఆలయంలోని అలంకార మండపంలో ఉత్సవర్లను పూలతో, స్వర్ణాభరణాలతో అలంకరించి వేదికపై ప్రతిష్ఠించారు.పండితులు నిర్ణయించిన శుభఘడియల్లో వాయిద్యాలు మోగుతుండగా, వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం ముగిసింది. అర్చకులు స్వామి,అమ్మవారిపై ముత్యాల తలంబ్రాలు పోశారు.చిత్తూరుకు చెందిన న్యాయవాది సావిత్రమ్మ,లోకనాథరెడ్డి ఉభయదారులుగా వ్యవహరించారు.శనివారం ఉదయం పార్వతీపరమేశ్వరులు భృంగివాహనంపై విహరించారు. మొగిలికి చెందిన పాటూరు హిమబిందు,యశ్వంత్ కుమార్, మంజునాథ్ కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. రాత్రి అశ్వవాహనంపై ఉత్సవమూర్తులను పురవీధుల్లో ఊరేగించారు.ఆలయ వంశపారంపర్య ధర్మకర్త ఎంబీ విజయకుమార్,ఈవో మునిరాజ తదితరులు పాల్గొన్నారు.బ్రహ్మోత్సవాల్లో ఆదివారం ఉదయాత్పూర్వం తెప్పోత్సవం, సాయంత్రం 6 గంటలకు రథోత్సవం నిర్వహించనున్నారు.



భృంగి వాహనంపై విహరిస్తున్న శివపార్వతులు

ఇంటర్ పరీక్షలు ప్రారంభం

- పుత్తూరు రోడ్డులో ట్రాఫిక్ ఇబ్బందులు



పీసీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద విద్యార్థులు, వారి తల్లిదండ్రులు



ఆర్కే జూనియర్ కళాశాల వద్ద హాల్ టికెట్ నెంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు

చిత్తూరు సెంట్రల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో శనివారం నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. పీసీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి పుత్తూరు రోడ్డులో ఐటీఐ వరకు ట్రాఫిక్ జామ్‌తో విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. ఈ మార్గంలోనే పలు జూనియర్ కళాశాలలు ఉండటంతో మరిన్ని కష్టాలు తప్పలేదు. ఇవన్నీ ఇలా ఉంటే.. కళాశాలకు సంబంధించిన పేరు, సెంటర్ కోడ్‌తో కూడిన సూచిక బోర్డులు సరిగ్గా ఏర్పాటు చేయలేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపించారు. పరీక్ష కేంద్రాల వద్ద కూడా హాల్‌టికెట్లు నెంబర్లను సూచించే నోటీసు బోర్డులు కూడా తగినన్ని ఏర్పాటు చేయలేదన్నారు. ఇలా.. చిన్న చిన్న సంఘటనల నడుమ తొలి రోజు పరీక్షలు ముగిశాయి.

ఆ 84 మందివి మరిన్ని కష్టాలు

తిరుపతికి చెందిన 84 మంది విద్యార్థులకు చిత్తూరు జిల్లాలో పరీక్ష కేంద్రాలు కేటాయించిన విషయం తెలిసిందే. వీరంతా తమ పరీక్ష కేంద్రాలను గుర్తించడానికి మరిన్ని కష్టాలు పడాల్సి ఉంది.

'హాల్ టికెట్లు' ఇవ్వకపోవడంపై విద్యాశాఖ సీరియస్

జిల్లా వ్యాప్తంగా 15 సెంటర్లలో ఓపెన్ స్కూల్ ఇంటర్మీడియట్ పరీక్షలు సోమవారం నుంచి ఈనెల 15వ తేదీవరకు నిర్వహించనున్నారు. సార్వత్రిక విద్యాపీఠం కింద విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లాలో 64 స్టడీసెంటర్లు నిర్వహిస్తోంది. వీటి ద్వారా 3,419మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. అయితే పరీక్షలకు ఇక రెండ్రోజులే సమయం ఉన్నా- పలు స్టడీ సెంటర్ల నిర్వాహకులు అభ్యర్థులకు హాల్ టికెట్లు ఇవ్వలేదు. దీనిపై జిల్లా విద్యాశాఖ అధికారులు సీరియస్ అయ్యారు. హాల్‌టికెట్లు వెంటనే అందించకుంటే స్టడీ సెంటరును బ్లాక్ లిస్టులో పెట్టడంతోపాటు పరీక్షల చట్టం 25/1997 ప్రకారం చర్యలు తీసుకోనున్నట్లు విద్యాశాఖ అధికారులు శనివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు.

విద్యార్థుల హాజరు, గైర్హాజరు ఇలా..

ఇంటర్మీడియర్ ఫస్టియర్ (తెలుగు, హిందీ, సంస్కృతం, ఉర్దూ, తమిళం) పరీక్షలకు 16,568 మంది విద్యార్థులకు 15679 మంది హాజరవగా, 889 మంది గైర్హాజరైనట్లు డీవీఈవో సయ్యద్ మౌల తెలిపారు. జనరల్ విభాగంలో 14,480 మందికి 13,794 మంది హాజరవగా, 686 మంది గైర్హాజరైనట్లు చెప్పారు. ఒకేషనల్‌లో 2088 మందికి 1885 మంది హాజరవగా, 203 మంది గైర్హాజరైనట్లు వివరించారు. డీవీఈవో, జిల్లా పరీక్షల కన్వీనర్.. నాలుగు సెంటర్లు, జిల్లా ప్రత్యేక అధికారి దయానందరాజు నాలుగు సెంటర్లను తనిఖీ చేశారు. జిల్లాలో ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ జరగలేదని, పరీక్ష కేంద్రాలను జిల్లా కార్యాలయం నుంచి పర్యవేక్షించినట్లు డీవీఈవో పేర్కొన్నారు.







సమయం మించిపోతుండటంతో పరీక్ష కేంద్రంలోకి పరుగులు పెడుతున్న విద్యార్థులు - తనిఖీ చేస్తున్న సిబ్బంది

జాతర ప్రయాణంలో విషాదం

- లారీ ఢీకొని తల్లీకుమారుల దుర్మరణం
- మరో కుమారుడి పరిస్థితి విషమం

శాంతిపురం, మార్చి 1(ఆంధ్రజ్యోతి):ముందు వెళుతున్న ఆటోను అధిగమించే క్రమంలో రెండు ద్విచక్ర వాహనాలను లారీ ఢీకొన్న ప్రమాదంలో తల్లి, కుమారుడు మృతి చెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు.... బైరెడ్డిపల్లె మండలం మూగనపల్లెకు చెందిన మునిరాజు భార్య తులసమ్మ (45) తన కుమారులు పవన్‌కుమార్(28), రవితేజ (25)లతో కలసి ద్విచక్ర వాహనంపై శాంతిపురం మండలం సోగడబల్లలో జరిగే జాతరకు శనివారం మధ్యాహ్నం బయల్దేరారు. కుప్పం - పలమనేరు జాతీయ రహదారిలోని మఠం వద్దకు రాగానే కుప్పం వైపు నుంచి వి.కోట వైపు వస్తున్న ఓ లారీ ముందు వెళుతున్న ఆటోను అధిగమించే క్రమంలో వీరి ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. అదే లారీ వీరి వెనుక మరో ద్విచక్ర వాహనంపై వస్తున్న వి.కోటకు చెందిన రాజేష్(25)నూ ఢీకొంది.ఈ ఘటనల్లో తులసమ్మ,రవితేజ మృతి చెందగా, పవన్‌కుమార్,రాజేష్ తీవ్రంగా గాయపడ్డారు.ప్రమాదాన్ని గమనించిన స్థానికులు ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన పవన్‌కుమార్, రాజేష్‌లను 108 అంబులెన్స్ ద్వారా కుప్పం పీఈఎస్ వైద్య కళాశాల ఆస్పత్రికి తరలించారు. వీరిలో పవన్‌కుమార్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. లారీ డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగినట్లు పోలీసులకు స్థానికులు తెలిపారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కుప్పం వంద పడకల ఆస్పత్రికి తరలించిన రాళ్ళబూదుగూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.





మృతులు రవితేజ, తల్లి తులసమ్మ

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (ఆదివారం) : 6.27

సహరి (సోమవారం) : 5.08



తిరుమలేశుడి సేవలో
నటి మెహరీన్

సినీ నటి మెహరీన్ శనివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. వేకువజామున సుప్రభాత సేవలో ఆమె పాల్గొన్నారు. సుప్రభాత పఠనం పూర్తికాగానే గర్భాలయానికి చేరుకుని మూలమూర్తిని దర్శించుకున్నారు. ఆలయాధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు. కాగా, ఆలయం ముందు మెహరీన్‌ను చూసేందుకు సినీ అభిమానులు ఉత్సాహం చూపారు. ఆమెతో సెల్ఫీలు తీసుకునేందుకు ఎగబడ్డారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

ముక్కంటి సేవలో
నటి హన్సిక



జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని శనివారం సినీ నటి హన్సిక దర్శించుకున్నారు. ఆలయాధికారులు ఆమెకు స్వాగతం పలికి, దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదపండితులు ఆమెను ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.


- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి

నేడు స్థానికుల దర్శన కోటా టోకెన్ల జారీ

ప్రతినెలా మొదటి మంగళవారం తిరుపతి, తిరుమల స్థానికులకు కల్పించే శ్రీవారి దర్శన కోటా టోకెన్లను టీటీడీ ఆదివారం జారీ చేయనుంది. ఈ నెల 4వ తేదీన టీటీడీ స్థానికులకు దర్శనం కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. తిరుపతి వాసులకు మహతి ఆడిటోరియంలోని కౌంటర్లలో, తిరుమల స్థానికులకు బాలాజీనగర్‌లోని కమ్యూనిటీ హాల్‌లో మొదట వచ్చిన వారికి మొదట ప్రాతిపదికన ఆదివారం ఉదయం 5 గంటల నుంచి టోకెన్లు జారీ చేయనున్నారు. తిరుపతి అర్బన్, రూరల్, చంద్రగిరి, రేణిగుంట మండలాలకు చెందిన స్థానికులు తమ ఆధార్ కార్డు చూపించి టోకెన్లు పొందవచ్చు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

శ్రీవారి సర్వదర్శనానికి 6 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 6 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 12 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

గురువారం నాటి హుండీ ఆదాయం: రూ.3.24 కోట్లు

శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 52,731

తలనీలాలు సమర్పించినవారు: 17,664


పెరిగిన మల్బరీ తోట

సెరికల్చర్‌తో లాభాల సిరి
పుత్తూరు మండలంలో పెరుగుతున్న సాగు

మనసుంటే మార్గం ఉంటుందంటారు. పుత్తూరు మండలంలో కొంతమంది రైతుల సాగుతీరు పరిశీలిస్తే ఈమాట అక్షరాలా నిజం. ఏటా సంప్రదాయ పంటలే సాగుచేయడం, నష్టాలను చవిచూడడం చాలామంది రైతులకు అలవాటు. దీని నుంచి బయటపడటానికి ఆసక్తి చూపించరు. ఫలితంగా ఏటేటా నష్టాలను మూటగట్టుకుంటారు. కానీ గొల్లపల్లి, రామకృష్ణాపురం, కొండల్‌చెరువు గ్రామాల్లో కొందరు రైతులు భిన్నంగా ఆలోచించారు. కొత్త ఒరవడికి స్వాగతం పలికారు. నష్టాల భారాన్ని దించుకున్నారు. నెమ్మదిగా లాభాలబాట పట్టారు. ఈ రైతుల బతుకుల్లో ఆనందాల సిరులు పంచుతున్నది సెరికల్చర్ సాగు.

-పుత్తూరు,ఆంధ్రజ్యోతి

పుత్తూరు మండలంలో వాస్తవానికి సెరికల్చర్ (మల్బరీ లేక పట్టుగూళ్లు)కు 1978లోనే అడుగులు పడ్డాయి. నాటి ఎమ్మెల్యే కేబీ సిద్దయ్య రాష్ట్ర సెరికల్చర్ బోర్డు ఛైర్మన్‌గా నియమితులయ్యాక కరువుకాటకాల్లో మునిగి తేలుతున్న రైతులకు సెరికల్చర్ ప్రత్యామ్నాయ మార్గమని నమ్మి ఈ సాగును పరిచయం చేశారు. దీంతో పలువురు రైతులు పట్టుగూళ్ల పెంపకానికి శ్రీకారం చుట్టారు. లాభాలను తొలిసారిగా రుచి చూశారు. అయితే కాలక్రమేణా ఈ రంగానికి ప్రోత్సాహం కొరవడడంతో రైతులు మళ్లీ పాత పంటల సాగుకే మొగ్గు చూపారు. అయితే కొన్నాళ్లుగా సెరికల్చర్‌కు ప్రభుత్వం నుంచి చేయూత పెరిగింది. ఫలితంగా రైతులు పట్టుపురుగుల పెంపకానికి ఆసక్తి చూపుతున్నారు. మామిడి, వరి, చెరకు వంటి పంటల సాగుతో చేతులు కాల్చుకుంటున్నామని గ్రహించి మల్బరీ వైపు చూస్తున్నారు.


గూళ్లను ఏరుతున్న కూలీలు


షెడ్డులో బెడ్డులు

సాగు విధానమిలా..

పొలాన్ని దుక్కి దున్ని మల్బరీ కొమ్మలను బోదెల్లో నాటాలి. ఎక్కువ నీరు అవసరం ఉండదు. సేంద్రియ ఎరువులు, వేపనూనెను వినియోగించి డ్రిప్ ఇరిగేషన్ ద్వారా నీటిని అందించాలి. షెడ్డును, లోపల ఇనుప స్తంభాలతో మూడు లేక నాలుగు అంచెల బెడ్లు నిర్మించుకోవాలి. షెడ్డులో ఉష్ణోగ్రతలను నియంత్రించేందుకు వేసవిలో నీడనిచ్చే చెట్లు చుట్టుపక్కలా పెంచాలి. శీతాకాలంలో కిటికీలను గోనె సంచులతో మూసివేయాలి. ఉష్ణోగ్రత గుర్తించేందుకు షెడ్డులో కొలమానిని వుంచుకోవాలి. మల్బరీ చెట్లు ఏపుగా పెరిగాక అయిదు రోజుల పట్టు పురుగులను (చాకీ సెంటర్) పెంపకందారుల నుంచి తీసుకువస్తారు. ఎకరానికి 125 గుడ్లను తీసుకుంటే నూగు గింజల సైజులో గుడ్డునుంచి సగటున 600 పురుగులుంటాయి. వీటిని బ్లీచింగ్ పౌడర్‌తో శుభ్రపరచి షెడ్డులోని బెడ్డు మీద చేర్చాలి. రెండు పూటలా మల్బరీ ఆకులను కత్తిరించి పురుగులకు ఆహారంగా వేయాలి. పురుగు సైజు పెరిగే కొద్దీ మల్బరీ ఆకు కొమ్మలను బెడ్డు మీద ముందుకు జరుపుతూపోవాలి. పట్టు గూళ్లు తయారయ్యే ఇరవై రోజుల వ్యవధిలో మూడు సార్లు నిద్రావస్థ (జ్వరం) సమయంలో పురుగు ఆహారం తీసుకోదు. సైజు పెరగని పురుగులను పరిశీలిస్తూ తొలగించాలి. 20 రోజుల తర్వాత వలలో పెట్టిన గూళ్లను సేకరించి బాక్సులతో మార్కెట్‌కు చేరవేయాలి. ధరను బట్టి కిలోల లెక్కన అధికారులు ఈ బాక్సులను వ్యాపారులకు అప్పజెప్పి మర్నాడే నగదును రైతుల బ్యాంకు ఖాతాలో జమ చేస్తారు. పంట పూర్తయ్యాక షెడ్డును శుభ్రపరిచి మరో పంటకు సమాయత్తం కావాలి.

మరింత ప్రోత్సాహం అవసరం



ప్రస్తుతం ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీతో పాటు మరిన్ని వసతులను కల్పిస్తే సాగు ఖర్చులు తగ్గి రాబడి పెరుగుతుంది. షెడ్డు, బెడ్లు, వలలకు సబ్సిడీ అందుతోంది. మల్బరీ మొక్కల సాగు, ఆకుల కత్తిరింపులో పెట్టుబడుల ఖర్చును తగ్గించేందుకు చిన్న ట్రాక్టర్లు, కట్టర్లు, వేపనూనె, బ్లీచింగు పౌడరు, సున్నం వంటి వాటిని ప్రభుత్వం అందిస్తే బాగుంటుంది.పలమనేరు,మదనపల్లెలతో పాటు మరికొన్ని చోట్ల పట్టు గూళ్ల విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేస్తే రవాణా ఖర్చులు ఆదా అవుతాయి.

- మునిబాలకృష్ణయ్య,గొల్లపల్లి

తక్కువ వ్యవధిలో ఎక్కువ లాభాలు



సాధారణంగా ఏడాదికి తొమ్మిది పంటలు తీసుకోవచ్చు. తక్కువ వ్యవధిలోనే సాగుకు వీలున్న పంట ఇది. ఎకరాకు దాదాపు రూ.5 లక్షలు ఆర్జిస్తున్నట్లు కొందరు రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం పుత్తూరు మండలంలో 30 ఎకరాలకుపైగా మల్బరీ సాగు చేస్తున్నారు. భవిష్యత్‌లో సాగు విస్తీర్ణం మరింత పెరుగుతుంది.

- శిరీష, సెరికల్చర్ అధికారిణి

గాజులమండ్యం నుంచి శ్రీసిటీ మీదుగా తడకు కొత్త రోడ్డు

- గతేడాది సీఎం ఆదేశాలతో తాజాగా సర్వేకు నిర్ణయం
- అధ్యయనానికి రూ.1.775 కోట్లు మంజూరు

తిరుపతి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): రేణిగుంట విమానాశ్రయం నుంచి శ్రీసిటీకి నేరుగా రోడ్డు సదుపాయం కల్పించాలంటూ గతేడాది సీఎం నారా చంద్రబాబు నాయుడు కలెక్టర్ వెంకటేశ్వర్‌కు చేసిన ఆదేశం ఇపుడు కార్యరూపం దాల్చుతోంది.అందులో భాగంగా రోడ్డు నిర్మాణంపై డీపీఆర్ రూపొందించేందుకు ప్రభుత్వం తాజాగా రూ.1.775 కోట్లు మంజూరు చేసింది. డీపీఆర్ రూపొందించే కన్సల్టెన్సీని ఎంపిక చేయాల్సిందిగా ఆర్ అండ్ బీ ఇంజనీరింగ్ ఉన్నతాధికారులను ఆదేశించింది. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.గతేడాది నవంబరులో సీఎం చంద్రబాబు స్వగ్రామమైన నారావారిపల్లికి వచ్చిన సందర్భంలో జిల్లా అభివృద్ధిపై కలెక్టర్ వెంకటేశ్వర్‌తో చర్చించారు. ఆ సమయంలో ప్రత్యేకించి జిల్లాలో కొన్ని కొత్త రోడ్ల నిర్మాణానికి సంబంధించి సూచనలు చేశారు. వాటిలో రేణిగుంట విమానాశ్రయం నుంచి నేరుగా శ్రీసిటీకి రోడ్డు నిర్మించాలనేది ఒకటి. ఇప్పటివరకూ ఎయిర్‌పోర్టు నుంచి లేదా తిరుపతి నుంచి శ్రీసిటీ చేరుకోవడానికి శ్రీకాళహస్తి మీదుగా వెళ్లాల్సి వస్తోంది. ట్రాఫిక్ కూడా ఇబ్బందికరంగా ఉంటోంది. పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు,దేశ విదేశాలకు చెందిన ప్రభుత్వాల, పరిశ్రమల ప్రతినిధులు తరచూ శ్రీసిటీని సందర్శిస్తున్న నేపథ్యంలో వారికి రాకపోకలు సుగమం చేయాలని సీఎం సూచించారు. దానికోసం రేణిగుంట విమానాశ్రయం నుంచి శ్రీసిటీకి నేరుగా కనెక్టివిటీ ఉండేలా కొత్తగా రోడ్డు నిర్మిస్తే బాగుంటుందని సీఎం సూచించారు.దీనిపై జిల్లా ఆర్ అండ్ బీ శాఖ ఇంజనీరింగ్ అధికారులతో కలసి ప్రాథమిక అధ్యయనం చేసిన కలెక్టర్ విమానాశ్రయానికి చేరువగా ఉన్న ఎన్‌హెచ్ 716పై గాజులమండ్యం నుంచి గుడిమల్లం, కాట్రపల్లి, శ్రీసిటీల మీదుగా తడలోని కోల్‌కతా-చెన్నై జాతీయ రహదారి అయిన ఎన్‌హెచ్-16ను కలుపుతూ కొత్త రోడ్డు నిర్మించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదన పంపించారు. ఆర్ అండ్ బీ శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్, ఏపీ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీలు సమీక్షించి రోడ్డు నిర్మాణానికి కన్సల్టెన్సీని నియమించి డీపీఆర్ రూపొందించాలని ప్రభుత్వానికి ప్రతిపాదించారు. పబ్లిక్, ప్రైవేట్ పార్టనర్‌షిప్ ప్రాతిపదికన రోడ్డు నిర్మించాలని ప్రతిపాదించారు.దానికోసం రూ.1.775కోట్లు అవసరమవుతుందని అంచనా వేశారు. ఆ మేరకు ప్రభుత్వం రూ.1.775కోట్లు మంజూరు చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. సాంకేతికంగానూ, ఆర్థికంగానూ రోడ్డు నిర్మాణానికి గల సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేసి డీపీఆర్ రూపొందించేందుకు ఓపెన్ కాంపిటిటివ్ బిడ్డింగ్ పిలిచి కన్సల్టెన్సీని ఎంపిక చేయాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో ఆదేశించింది.ఇది పూర్తయితే జిల్లాలో రోడ్డు కనెక్టివిటీకి సంబంధించి ఇదో ప్రధాన మలుపు కానుంది.

శ్రీసిటీలో షార్ 'స్పేస్ ఆన్ వీల్స్' ఎగ్జిబిషన్

శ్రీసిటీ, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇస్రోకు సంబంధించిన సమాచారంతో పాటు అంతరిక్ష సాంకేతికతపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందించేలా శ్రీసిటీ, శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్) ఆధ్వర్యంలో శ్రీసిటీలో స్పేస్ ఆన్ వీల్స్ మొబైల్ ప్రదర్శన ఏర్పాటు చేశారు. శుక్ర, శనివారాల్లో సాగిన ప్రదర్శనలో స్థానిక ట్రిపుల్ ఐటీ, క్రియా యూనివర్సిటీ, అకార్డ్ స్కూల్, చిన్మయ విద్యాలయ విద్యార్థులు పాల్గొన్నారు. మొదటి ఉపగ్రహ ప్రయోగ వాహనం నుంచి తాజా పురోగతి వరకు వివిధ ప్రయోగాలు, లాంచ్‌ప్యాడ్‌లు, చంద్రయాన్, మంగళయాన్, రిమోట్ సెన్సింగ్ అప్లికేషన్లు, ఇండియన్ రీజనల్ సెన్సింగ్ అప్లికేషన్లు, శాటిలైట్ కమ్యూనికేషన్ టెక్నాలజీకి సంబంధించిన నమూనాలను ప్రదర్శించారు. అవకాశం కల్పించిన షార్ డైరెక్టర్ రాజరాజన్‌కు శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. కాగా, షార్ అధికారి కిరణ్ ఆధ్వర్యంలో బృందం ఇస్రోకు సంబంధించిన వివిధ ప్రయోగాలను విద్యార్థులకు అవగాహన కలిగేలా వివరించారు.


నమూనాలను ఆసక్తిగా తిలకిస్తున్న విద్యార్థులు

పుత్తూరు మున్సిపాలిటీలో అక్రమాలపై విచారణ

- అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్యే ఫిర్యాదు
- పురపాలక శాఖ ఆర్డీ విశ్వనాథ్ నేతృత్వంలో దర్యాప్తు


పుత్తూరు అర్బన్, మార్చి1(ఆంధ్రజ్యోతి): పుత్తూరు మున్సిపాలిటీలో 2019-24 మధ్యకాలంలో రూ.కోట్లలో అవినీతి అక్రమాలు చోటుచేసుకున్నాయని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమయంలో ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పురపాలక శాఖ రీజనల్ కో-ఆర్డినేటర్ విశ్వనాథ్ నేతృత్వంలో విచారణకు కమిటీ నియమించారు. ఇప్పటికే మున్సిపాలిటీలో కమిటీ గోప్యంగా విచారణ కొనసాగిస్తోంది. కమిషనర్ వెంట్రామిరెడ్డి హయాంలో చోటుచేసుకున్న అక్రమాలపై దృష్టి సారించింది. అందుకు సంబంధించిన రికార్డులు తనిఖీ చేస్తున్నారు. 2021మే 18వ తేదీన కుంగిన ఎస్ఎస్ ట్యాంకు కట్ట మరమ్మతులకు రూ.5లక్షలైనా ఖర్చవలేదు. కానీ సాధారణ నిధుల నుంచి రూ.12లక్షలు ఖర్చు అయినట్లు బిల్లులు పెట్టారు. మున్సిపల్ నూతన భవన నిర్మాణ పనులు కాంట్రాక్టరుకు అప్పగించాక సాధారణ నిధుల నుంచి డబ్బు డ్రా చేయడం అప్పట్లో విమర్శలకు దారితీసింది. మూలనపడ్డ వాహనాల విక్రయాల్లో జరిగిన అక్రమాలపైనా విచారణ జరుపుతున్నారు. ఇంజనీరింగ్ విభాగంలో ఇష్టారాజ్యంగా బిల్లులు ఆమోదం చేసినట్లు ఆరోపణలున్నాయి. ఈ క్రమంలో విచారణ ద్వారా నిజాలు నిగ్గుతేల్చనున్నారు. ఆదివారమూ విచారణ కొనసాగనుంది.

ఇంటర్ పరీక్షల ఏర్పాట్లు చేస్తూ..
గుండెపోటుతో జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ మృతి


జగన్మోహనాచార్యులు (ఫైల్)

సత్యవేడు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ పరీక్షల ఏర్పాట్లలో నిమగ్నమైన సత్యవేడు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జగన్మోహనాచార్యులు (54) శుక్రవారం అర్ధరాత్రి గుండెపోటుతో మరణించారు. శనివారం నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభం కానుండడంతో పరీక్షల ప్రధాన అధికారిగా ఆయన శుక్రవారం ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. పనులు పూర్తయ్యే సరికి పొద్దుపోయింది. ఇంటికి (తిరుపతికి) వెళ్లకుండా రాత్రి కాలేజీలోనే బసచేశారు. అర్ధరాత్రి సమయంలో గుండెపోటు రావడంతో స్పృహ కోల్పోయారు. గమనించిన సిబ్బంది ఆస్పత్రికి తరలించేలోపు మృతి చెందారు. తిరుపతిలోని ఆయన కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వారు కళాశాలకు చేరుకుని మృతదేహాన్ని ఇంటికి తీసుకెళ్లారు. ప్రిన్సిపాల్ మరణంతో కళాశాలలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆయన స్వస్థలం కడప జిల్లా జమ్మలమడుగు మండలం. 2023లో బదిలీపై ఇక్కడకు వచ్చారు.

బ్లిస్ హోటల్‌కు బాంబు బెదిరింపు


హోటల్‌లో తనిఖీలు చేస్తున్న పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), మార్చి 1 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని బ్లిస్ హోటల్‌కు బాంబు బెదిరింపులు వచ్చాయి.హోటల్‌ను బాంబులతో పేల్చివేస్తామని హెచ్చరిస్తూ మేనేజర్‌కు మెయిల్ రావడంతో వెంటనే అప్రమత్తమయ్యారు. మెయిల్ ఐడీని తిరుపతి ఈస్ట్ సీఐ రామకృష్ణకు పంపారు. ఆయన బాంబు, డాగ్ స్క్వాడ్‌లతో కలిసి హోటల్లో అణువణువునా తనిఖీలు చేశారు. అన్ని గదులు, రిసెప్షన్, వంటగదులు, వాష్‌రూములు, మేనేజర్ చాంబర్‌ను తనిఖీ చేసి ఎలాంటి పేలుడు పదార్థాలూ లేవని నిర్ధారించారు. దీంతో హోటల్ సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు.

టీడీపీ నేతల నడుమ 'మట్టి' యుద్ధం

- ఓ వర్గం అక్రమ తవ్వకాలపై మరో వర్గం ఫిర్యాదు
- నాలుగు టిప్పర్లను పట్టుకున్న పోలీసులు
- ఓ నేత జోక్యంతో రెండింటి విడుదల... మరో నేత ఒత్తిడితో తిరిగి స్వాధీనం
- ఈసారి నాలుగింటినీ విడిపించుకెళ్లిన వైనం
- గాజులమండ్యం స్టేషన్‌లో వారం రోజులుగా పంచాయితీ

రేణిగుంట,మార్చి1(ఆంధ్రజ్యోతి): రేణిగుంట మండలంలో కొందరు టీడీపీ నేతల నడుమ మట్టి యుద్ధం నడుస్తోంది. గాజులమండ్యం పోలీస్‌స్టేషన్ వేదికగా వారం రోజుల నుంచి సాగుతున్న ఆధిపత్య పోరు మండల వ్యాప్తంగా చర్చనీయాంశమవుతోంది. విశ్వసనీయ సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. గత ఆదివారం రాత్రి మండలంలోని కొట్రకోనకు చెందిన టీడీపీ నాయకుడొకరు నాలుగు టిప్పర్లలో గాజులమండ్యం చెరువు నుంచి మట్టి అక్రమంగా తరలిస్తున్నారు. గాజులమండ్యం గ్రామానికి చెందిన టీడీపీ నేత, ఆయన అనుచరులు గాజులమండ్యం పోలీసులకు సమాచారం ఇచ్చారు. చెరువు వద్దకు వచ్చిన పోలీసులు మట్టి తరలిస్తున్న నాలుగు టిప్పర్లను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మట్టి దందా చేపట్టిన నాయకుడు మండల స్థాయి నేతను ఆశ్రయించారు. ఆ నేత సోమవారం ఉదయం గాజులమండ్యం స్టేషన్‌కు వెళ్లి అక్కడున్న నాలుగు టిప్పర్లలో రెండింటిని విడిపించి తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న గాజులమండ్యం టీడీపీ నేత నేరుగా పోలీసు స్టేషన్ చేరుకుని పట్టుకున్న టిప్పర్లను ఎలా విడిచిపెట్టారంటూ సిబ్బందిని నిలదీశారు. దీంతో పోలీసులు హడావిడిగా ఆ టిప్పర్లను మళ్లీ స్టేషన్‌కు రప్పించారు. తాను విడిపించిన టిప్పర్లను పోలీసులు తిరిగి స్వాధీనం చేసుకున్నారని తెలుసుకున్న మండల స్థాయి నేత పోలీసులపై ఒత్తిడి తెచ్చి సాయంత్రానికల్లా మొత్తం నాలుగు టిప్పర్లనూ విడిపించేశారు. కేసు నమోదు చేయకపోగా పట్టుకున్న నాలుగు టిప్పర్లనూ విడిచిపెట్టేయడంతో గాజులమండ్యం టీడీపీ నేత, ఆయన అనుచరులు మండిపడుతున్నారు. టిప్పర్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేయాల్సిందేనంటూ గాజులమండ్యం పోలీసులపై భీష్మించుకున్నారు. దీంతో పోలీసులు ఇపుడు టిప్పర్లు తీసుకొచ్చి స్టేషన్ వద్ద పెట్టండంటూ మండల స్థాయి నేతను బతిమాలుకుంటున్నారు. వారం రోజులుగా పంచాయతీ జరుగుతున్నా టీడీపీలోని రెండు వర్గాల్లో ఏ వర్గమూ వెనక్కు తగ్గడం లేదు. మట్టి దందా చేపట్టిన కొట్రకోనకు చెందిన టీడీపీ నాయకుడు తనకు వ్యతిరేకంగా పోలీసులకు సమాచారమిచ్చి, కేసు నమోదుకు పట్టుబట్టిన నేతకు ఫోన్ చేసి బెదిరింపులకు దిగినట్లు సమాచారం. ఈ క్రమంలో శనివారం రాత్రి పది గంటలకు నాలుగు లారీలను పోలీస్‌స్టేషన్‌లో తీసుకొచ్చి పెట్టారు. ఈ వ్యవహారం మండల టీడీపీ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమవుతోంది. కాగా ఈ వ్యవహారంపై రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసరావును వివరణ కోరగా తన దృష్టికి రాలేదన్నారు. విచారించి వాస్తవమని తేలితే చర్యలు తీసుకుంటామన్నారు.

తిరుమలను నో ఫ్లయింగ్ జోన్‌గా ప్రకటించండి

- కేంద్రమంత్రికి టీటీడీ చైర్మన్ లేఖ

తిరుమల, మార్చి1(ఆంధ్రజ్యోతి): తిరుమల పుణ్యక్షేత్రంపై విమానాలు ఎగరకుండా నో ఫ్లయింగ్ జోన్‌గా ప్రకటించాలని కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుకు టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు లేఖ రాశారు. ఆగమశాస్త్ర నిబంధనలు, ఆలయ పవిత్రత, భద్రత, భక్తుల మనోభావాలను దృష్టిలో ఉంచుకుని ఈ మేరకు ప్రకటించాలని కోరారు. తిరుమల కొండపై తక్కువ ఎత్తులో ఎగిరే విమానాలు, హెలికాప్టర్లు, ఇతర వైమానిక కార్యకలాపాలతో శ్రీవారి ఆలయం చుట్టూ ఉన్న పవిత్రమైన వాతావరణానికి భంగం కలుగుతోందని పేర్కొన్నారు. తక్షణం ఈ విషయంపై స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

పింఛన్ల పంపిణీలో మొదటిస్థానం

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 1 (ఆంధ్రజ్యోతి): పింఛన్ల పంపిణీలో జిల్లాకు మొదటిస్థానం దక్కింది. 2,62,461 మందికి గాను తొలిరోజైన శనివారం 2,53,656 మందికి (96.65 శాతం) పంపిణీ చేశారు. రూ.107.03 కోట్లను 5,800 మంది సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు అందజేశారు. కలెక్టర్ వెంకటేశ్వర్ తిరుపతి రూరల్ మండలం వేదాంతపురంలో పాల్గొన్నారు. జిల్లాకు మొదటి స్థానం దక్కడంపై డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు, ఏపీడీ ప్రభావతి, ఇతర ఉద్యోగులను ఆయన అభినందించారు.


వేదాంతపురం పంచాయతీలో పింఛను అందజేస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

గొలుసు దొంగ అరెస్ట్

- 170 గ్రాముల బంగారు ఆభరణాల స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ చెంచుబాబు, అర్బన్ సీఐ బాబీ

నాయుడుపేట టౌన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మహిళల మెడలోని బంగారు సరుడును అపహరించే యువకుడిని పోలీసులు అరెస్టు చేశారు. శనివారం నాయుడుపేట పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ చెంచుబాబు మీడియాకు వివరాలను వెల్లడించారు. నాయుడుపేట పొగొట్టం కాలనీకి చెందిన భవానీశంకర్ డిప్లమో పూర్తి చేశాడు. జులాయిగా తిరుగుతూ సులభ సంపాదనకు చోరీలను ఎంచుకున్నాడు. బైక్‌లో తిరుగుతూ ఇంటిముందు ముగ్గులు వేసే, వాకింగ్ చేసే మహిళల మెడలో బంగారు సరుడును లాక్కుని పరారయ్యేవాడు. పోలీసులు నిఘా పెట్టి, శనివారం అరెస్ట్ చేశారు. అతని నుంచి రూ.12లక్షల విలువచేసే 170 గ్రాముల బంగారు ఆభరణాలు రికవరీ చేసినట్లు డీఎస్పీ చెంచుబాబు తెలిపారు. ఈ కేసులో ప్రతిభ కనబరిచిన అర్బన్ సీఐ బాబీ ఎస్ఐ ఆదిలక్ష్మి, సిబ్బందిని అభినందించారు.

కల్యాణం.. కమనీయం

- వైభవంగా ఆదిదంపతుల వివాహ వేడుక
- తరలివచ్చిన భక్తజనం
- ఒక్కటైన 41 జంటలు





నేటి వాహన సేవలు ఉదయం: బనాత అంబారీ వాహన సేవ
రాత్రి: అశ్వ, సింహ వాహనసేవ

శ్రీకాళహస్తి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): అనంత విశ్వమే పందిరిగా... ఆచంద్రతారలే అలంకారాలుగా... భూమండలమే వివాహ వేదికగా... పంచభూతాల సాక్షిగా... అష్టదిక్కులు, ముల్లోకాల నుంచి ముక్కోటి దేవతాగణాలు వీక్షిస్తుండగా... అశేష భక్తజన వాహిని మధ్య శనివారం ఆది దంపతుల కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. తెల్లవారుజామున 4.30 గంటల ప్రాంతంలో వేద మంత్రోచ్చరణలు, మంగళ వాయిద్యాల మధ్య శాస్త్రోక్తంగా జ్ఞానప్రసూనాంబదేవికి శ్రీకాళహస్తీశ్వరుడు మాంగల్యధారణ చేశారు. ఇదే శుభ ఘడియలో ఆది దంపతుల సమక్షంలో 41 జంటలు వివాహం చేసుకుని ఒక్కటయ్యాయి. వధూవరులకు ముక్కంటి ఆలయం తరపున మంగళసూత్రాలు, పసుపు, కుంకుమ, గాజులు, దుస్తులు అందజేశారు. అంతకు మునుపు శుక్రవారం రాత్రి ఆలయంలోని అలంకార మండపంలో శ్రీకాళహస్తీశ్వరుడు, జ్ఞానప్రసూనాంబ అమ్మవారిని స్వర్ణాభరణాలతో అలంకరించారు. ఆలయ అర్చకులు స్వామి అమ్మవార్లకు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. తదనంతరం స్వామివారిని గజ వాహనంపై, అమ్మవారిని సింహ వాహనంపై అధిష్ఠింపజేశారు. మంగళవాయిద్యాలు, మేళతాళాలు, కళాకారుల ఆటలు, పాటల మధ్య ఆది దంపతులు పెండ్లిమండపం వద్దకు చేరుకున్నారు. మొదట పరమేశ్వరుడు చేరుకోవడంతో పార్వతీదేవి అలకబూనారు. చండికేశ్వరుడు మధ్యవర్తిత్వం నిర్వహించి అమ్మవారి అలక తీర్చారు. గంగాధరుడు, శివానీ పెళ్లిపీటలపై ఆశీనులయ్యారు. వేదపండితులు కలశ స్థాపన చేశారు. సంకల్పం, యజ్ఞాహుతి పూజలు పూర్తి చేశారు. పూజల అనంతరం వేదపండితులు మంత్రోచ్ఛరణలు చేస్తూ ఆదిదంపతుల కల్యాణ ఘట్టాన్ని పూర్తిచేశారు. కల్యాణం వీక్షించడానికి పట్టణవాసులతో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన భక్తజనం తరలివచ్చారు. నగరి వీధి, నెహ్రూ వీధి భక్తులతో నిండిపోయాయి. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి దంపతులు, ఈవో బాపిరెడ్డి, బీజేపీ నాయకుడు కోలా ఆనంద్, టీడీపీ నాయకుడు చెంచయ్యనాయుడు పాల్గొన్నారు.

నేడు కైలాసగిరి ప్రదక్షిణ

మహాశివరాత్రి వార్షికోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం కైలాసగిరి ప్రదక్షిణ నిర్వహించనున్నారు. శివపార్వతుల కల్యాణానికి విచ్చేసిన సకల దేవతాగణాలు, మునులు, రుషులకు వీడ్కోలు పలికేందుకు స్వామి అమ్మవార్లు ఈ ప్రదక్షిణకు వెళ్లనున్నారు. దీనికి సంబంధించి ఆలయాధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. గిరి ప్రదక్షిణ మార్గంలో చలువ పందిళ్లు సిద్ధం చేశారు. అన్న ప్రసాదాలు, తాగునీరు, పండ్లు, మజ్జిగ అందుబాటులో పెట్టనున్నారు.

వంద పడకల ఆస్పత్రి మంజూరు చేయండి

- సీఎం చంద్రబాబుకు థామస్ విన్నపం


ప్రజావేదిక సభలో ప్రసంగిస్తున్న థామస్

గంగాధరనెల్లూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): అత్యవసర పరిస్థితుల్లో గంగాధరనెల్లూరు నియోజకవర్గ ప్రజలు వైద్యసేవలకోసం వేలూరు సీఎంసీ ఆస్పత్రికి వెళ్ళాల్సి వస్తోందని, కాబట్టి గంగాధరనెల్లూరు ఆస్పత్రిని వందపడకల ఆస్పత్రిగా అభివృద్ధి చేయించి ఆదుకోవాలని సీఎం చంద్రబాబుకు విప్, ఎమ్మెల్యే డాక్టర్ థామస్ విన్నవించారు. గంగాధరనెల్లూరు పర్యటనలో భాగంగా సీఎం చంద్రబాబు ప్రజావేదిక వద్ద నిర్వహించిన గ్రామసభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా థామస్ మాట్లాడుతూ ఎనిమిది నెలల్లో రూ. 40 కోట్ల విలువ చేసే సిమెంటు రోడ్లు, గోకులం షెడ్ల పనులు నియోజకవర్గ పరిధిలో జరిగాయ న్నారు.చిత్తూరు- తచ్చూరు రోడ్డు ఏర్పాటవుతుందని, ప్రత్యేకించి ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు చేయించాలని కోరారు.జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ త్వరలోనే డీఎస్సీ నిర్వహించి 16వేల టీచర్ ఉద్యోగాలను భర్తీ చేయనున్నట్లు చెప్పారు.చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చాక సంక్షేమం, అభివృద్ధి రెండు రైలు పట్టాల్లాగా సమానంగా సాగుతోందని తెలిపారు.కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ గత ఎనిమిది నెలల కాలంలో సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు జిల్లాలో విరివిగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు.

ఏనుగుల గుంపుపై ప్రత్యేక నిఘా

కల్లూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో వారంరోజులుగా పంటలను ధ్వంసం చేసిన 12 ఏనుగుల గుంపు తిరుపతి జిల్లా భీమవరం, మూలపల్లి సమీపంలోని అటవీప్రాంతంలో మాటు వేశాయని, మండలం వైపు ఏనుగుల గుంపు రాకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు అటవీశాఖ ఎఫ్ఎస్‌వో మహమ్మద్ షఫీ తెలిపారు. తిరుపతి జిల్లా కళ్యాణి డ్యాం వద్ద ఉన్న 12 ఏనుగుల గుంపు వారం రోజుల క్రితం పులిచెర్ల మండలంలోకి ప్రవేశించాయి. ఎల్లంకివారిపల్లి, కావేటిగారిపల్లి పంచాయతీల పరిధిలో రాత్రి వేళ పంటలను ధ్వంసం చేస్తూ పగలు అడవిలోకి చేరుకునేవి. అటవీశాఖ అధికారులు సిబ్బందితో కలిసి పంటల వైపు ఏనుగులు రాకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవడంతో వచ్చిన దారిలోనే ఏనుగుల గుంపు తిరుగుముఖం పట్టాయి. మరో వైపు పాళెం, కల్లూరు, పాతపేట పంచాయతీల్లో ఒంటరి ఏనుగు పంటలను ధ్వంసం చేస్తుండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. శుక్రవారం పాతపేట పంచాయతీలో పంటలను ఒంటరి ఏనుగు ధ్వంసం చేసింది. ఇదే ప్రాంతంలో విద్యుత్ స్తంభాన్ని ఏనుగు ఢీకొన్న నేపథ్యంలో వైర్లు తెగిపోవడం, నిప్పులు చెలరేగడంతో భయభ్రాంతులకు గురైన ఒంటరి ఏనుగు గంటావారిపల్లి సమీపంలోని అడవిలోకి వెళ్లినట్లు ఎఫ్‌బీవో శ్రీదేవి తెలిపారు. పులిచెర్ల మండలం నుంచి తిరుపతికి భీమవరం అటవీ మార్గంలో వెళ్లే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ అధికారులు హెచ్చరించారు.

కుప్పం టౌన్ బ్యాంకుపై తొలగిన ఆంక్షలు

- రుణాల మంజూరుకు ఆర్‌బీఐ అనుమతి

కుప్పం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): కుప్పం కో ఆపరేటివ్ టౌన్ బ్యాంకుపై దాదాపు పదేళ్లుగా కొనసాగుతున్న ఆంక్షలు తొలగిపోయాయి. ఖాతాదారులకు రుణాలు మంజూరు చేయడానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అనుమతి లభించింది. దీంతో బ్యాంకు వర్గాలు, ఖాతాదారులతోపాటు కుప్పం ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కుప్పం కో ఆపరేటివ్ టౌన్ బ్యాంకు 1924లో స్థాపించబడింది. అక్టోబరు 17, 2024 నాటికి ఆ బ్యాంకు స్థాపించి 100 ఏళ్లు పూర్తయ్యాయి. అయితే ఆర్బీఐ ఆంక్షలు మెడపై కత్తిలా వేలాడుతుండటంతో వజ్రోత్సవాలు జరుపుకునే అవకాశం లేకుండా పోయింది. 2020లో బ్యాంకులో బయటపడిన కొన్ని అవకతవకలు ఆర్బీఐ ఆంక్షలు విధించడానికి కారణమయ్యాయి. టౌన్ బ్యాంకులో 6497 మంది షేర్ హోల్డర్సు ఉన్నారు. ఆర్బీఐ ఆంక్షలు విధించడంతో బ్యాంకు రుణాలు మంజూరు చేసే అవకాశం గాని షేర్ హోల్డర్స్‌కి డివిడెండ్ చె ల్లించే వెసులుబాటు గాని లేకుండా పోయింది. అంతేకాక ఎస్బీఐలో ఇస్తున్న వడ్డీనే టౌన్ బ్యాంకులోనూ ఇవ్వాలన్న నిబంధన విధించా రు. సిబ్బందిపై పలు రకాల ఆంక్షలు కొనసాగా యి. మరోవైపు టౌన్ బ్యాంకుకు ఎన్నికలు నిర్వహించకుండా నామినేటెడ్ పాలకమండళ్లు కొనసాగుతూ వచ్చాయి.ఇలా కొనసాగిన పాలకమండళ్లు బాధ్యతారహితంగా వ్యవహరించడం ఆర్బీఐ ఆంక్షలు, అలాగే కొనసాగానికి కారణమయ్యాయి. ప్రస్తుతం పాలక మండలి లేదు. పీఐసీ ఛైర్మన్ బ్రహ్మానందరెడ్డి పర్సన్ ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారు. అనంతర కా లంలో మెల్లగా టౌన్ బ్యాంకు కార్యకలాపాలు పుంజుకుంటూ వచ్చాయి. ఏళ్లతరబడి ఉండిపోయిన మొండి బకాయిలు రూ.3 కోట్లను వసూలు చేశారు. అంతేకాక గతంలో పెండింగులో ఉన్న ఇన్‌కంటాక్స్ కేసులలో బ్యాంకుల కు అనుకూలంగా తీర్పులు వచ్చాయి. బ్యాంకు నష్టాల బారి నుంచి నెమ్మదిగా బయటపడిం ది. ఆర్థిక పరిపుష్టిని చేకూర్చుకోవడంతోపాటు కార్యలాపాలు నిబంధనల మేరకు కొనసాగుతుండడంతో కుప్పం కోఆపరేటివ్ టౌన్ బ్యాంకుపై విధించిన ఆంక్షలు తొలగిస్తూ రిజ ర్వు బ్యాంకు ఫిబ్రవరి 28న ఉత్తర్వులు జారీచేసింది. రిజర్వు బ్యాంకు ఆంక్షలు తొలగిపోవడంతో బ్యాంకులో మార్టగేజ్ రుణాలు, బంగారు, గృహ రుణాలు యథావిధిగా ఇస్తామని పర్సన్ ఇన్‌చార్జి బ్రహ్మానందరెడ్డి, మేనేజరు శివకృష్ణ తెలిపారు. అలాగే ఈఏడాది మార్చి నెల తర్వాత షేర్ హోల్డర్స్‌కు ఇవ్వాల్సిన డివిడెండ్‌ను చెల్లిస్తామన్నారు.2026 నాటికి కుప్పం కో ఆపరేటివ్ టౌన్ బ్యాంకును లాభాల బాటలోకి తెస్తామన్న ఆశాభావం వ్యక్తం చేశారు.



కుప్పం టౌన్ బ్యాంకు

నేటినుంచి రంజాన్ ఉపవాస దీక్షలు

చిత్తూరు కల్చరల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): రంజాన్ ఉపవాస దీక్షలను ఆదివారం ఉదయం 5.08 గంటలకు సహరీతో జిల్లాలో ప్రారంభించనున్నారు. ఈ మేరకు జిల్లా వ్యాప్తంగా అన్ని మసీదుల్లో నిర్వాహకులు, ప్రభుత్వ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. అలాగే ముస్లిం ఉద్యోగులు రోజూ రంజాన్ ప్రార్థనల కోసం సాయంత్రం గంట ముందే కార్యాలయాల నుంచి వెళ్లడానికి ప్రభుత్వం అనుమతించింది.

దివాన్‌పై నుంచి పడి విద్యార్థి మృతి


రియాజ్ మృతదేహం

పలమనేరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో దివాన్‌పై పడుకొని నిద్రిస్తున్న ఓ పదో తరగతి విద్యార్థి నిద్రలో కిందపడి మృతిచెందిన సంఘటన శనివారం పలమనేరులో జరిగింది. కుటుంబ సభ్యుల కథనం మేరకు... పలమనేరుకు చెందిన గౌస్‌బాషా కుటుంబపోషణ కోసం దుబాయ్‌లో ఉండగా.. భార్య, కుమారుడు, కుమార్తె పలమనేరులో ని ఓ అద్దె ఇంట్లో కాపురం ఉంటున్నారు. గౌస్‌బాషా కుమారుడు రియాజ్ (15) పలమనేరులోని ఓ ప్రైవేటు పాఠశాలలో పదో తరగతి చదువుకుంటున్నాడు. శుక్రవారం రాత్రి రియాజ్ ఇంట్లోని దివాన్‌పైనే పడుకొని నిద్రపోయాడు. శనివారం తెల్లవారుజామున దివాన్‌పై నుంచి కింద పడ్డాడు. స్థానికుల సాయంతో తల్లి పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటికే రియాజ్ చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం అనంతరం పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

పశుసంవర్ధక శాఖ ఇన్‌చార్జి జేడీగా అబ్దుల్ ఆసిఫ్

చిత్తూరు సెంట్రల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా పశుసంవర్ధక శాఖ ఇన్‌చార్జి జేడీగా అబ్దుల్ ఆసిఫ్‌ను నియమిస్తూ ఆ శాఖ రాష్ట్రస్థాయి అధికారులు ఉత్తర్వులు జారీచేశారు. జేడీ ప్రభాకర్ శుక్రవారం ఉద్యోగ విరమణ పొందడంతో ఖాళీ ఏర్పడిన పోస్టుకు డీడీగా వ్యవహరిస్తున్న అబ్దుల్ ఆసిఫ్‌కు జేడీ ఎఫ్ఏసీగా నియమించారు.

వ్యవసాయ రంగానికి సబ్సిడీ రూ.5 లక్షలకు పెంపు

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగానికి సబ్సిడీ మొత్తాన్ని రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచడం జరిగిందని పీఎం నరేంద్ర మోదీ చెప్పారు. ఢిల్లీ నుంచి శనివారం వర్చువల్ విధానంలో దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. స్థానిక డీఆర్‌డీఏ మీటింగ్ హాలులో బ్యాంకర్లు, రైతులు, ఉద్యాన, వ్యవసాయశాఖ అధికారులు ఈ ప్రసంగాన్ని వీక్షించారు. అనంతరం ఎల్డీఎం హరీష్ మాట్లాడుతూ.. కేంద్రం స్వల్పకాలిక పంటరుణాలపై 1.50శాతం వడ్డీ రాయితీని అందిస్తుందన్నారు. దీనిద్వారా రైతులు బ్యాంకుకు చెల్లించాల్సిన వడ్డీ.. ఏడాదికి ఏడు శాతానికి తగ్గిందన్నారు. రుణాన్ని సకాలంలో తిరిగి చెల్లిస్తే అదనంగా మూడు శాతం ఇన్‌సెంటివ్ కూడా వర్తిస్తుందని చెప్పారు. దీనివల్ల రైతు చెల్లించాల్సిన వాస్తవ వడ్డీ 4శాతం మాత్రమే అన్నారు. రూ.2 లక్షల వరకు రుణాన్ని ఎలాంటి భూమి తనఖా లేకుండా క్రెడిట్ పరిమితితో కిసాన్ క్రెడిట్ కార్డును జారీచేసేందుకు ఆర్బీఐ బ్యాంకులకు అనుమతి ఇచ్చిందని తెలిపారు. నగరంలోని వివిధ బ్యాంకుల కంట్రోలింగ్ అధికారులు, చీఫ్ మేనేజర్లు పాల్గొన్నారు.

తొలి రోజు 96 శాతం పింఛన్ల పంపిణీ

చిత్తూరు సెంట్రల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లను తొలి రోజైన శనివారం జిల్లాలో 96 శాతం పంపిణీ చేశారు. 2,64,899 మంది లబ్ధిదారులకుగాను తొలి రోజున 2,54,375 మందికి (96.03 శాతం) పంపిణీ జరిగింది. నూతన నిబంధనలు అనుసరించి గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు ఉదయం ఏడు గంటల నుంచి పింఛన్ల పంపిణీ ప్రారంభించారు. లబ్ధిదారుల ఇళ్ల వద్దకెళ్లి నగదు అందజేశారు. మిగిలిన వారికి సోమవారం పంపిణీ చేయనున్నట్లు డీఆర్‌డీఏ అధికారులు తెలిపారు.





గంగాధర నెల్లూరులో శనివారం సీఎం పర్యటనలో భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న డీఐజీ షీముషి బాజ్‌పాయ్, ఎస్పీ మణికంఠ - ప్రజావేదిక గ్రామసభలో పాల్గొన్న ఎమ్మెల్యేలు మురళీమోహన్, జగన్మోహన్, పులివర్తి నాని, టీడీపీ జిల్లా అధ్యక్షుడు సీఆర్.రాజన్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత

ఆడపిల్లలను చదివిద్దాం: సీడీపీవో



పలమనేరులో నిర్వహించిన అవగాహన ర్యాలీ

పలమనేరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఆడపిల్లలను చదివిద్దామని సీడీపీవో ఇందిరా ప్రియదర్శిని అన్నారు. శనివారం జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని బేటీ బచావో.. బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా పలమనేరులో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా బాలికల చదువుపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం కార్యాలయం వద్ద మొక్కలను నాటారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ నజ్మా, హెచ్‌ఎం లత, ఉపాధ్యాయులు కుప్పమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కనకదుర్గమ్మకు కాణిపాకం పట్టువస్త్రాలు



పట్టువస్త్రాలు అందుకుంటున్న కనకదుర్గ అమ్మవారి ఆలయ కమిటీ సభ్యులు

పలమనేరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): పలమనేరులోని కనకదుర్గ అమ్మవారికి కాణిపాకం ఆలయ కార్యనిర్వాహక అధికారులు పట్టువస్త్రాలు, గాజులు అందజేశారు. శనివారం పలమనేరు నుంచి కాణిపాకం వెళ్లిన అమ్మవారి ఆలయ కమిటీ సభ్యులకు అందించడంతో కాణిపాకం ఆలయ కార్యనిర్వాహక అధికారులు పెంచలకిషోర్, ఏఈవో రవీంద్ర బాబులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

పలమనేరులో 97.05 శాతం పింఛన్ల పంపిణీ



దివ్యాంగుడికి పింఛను అందిస్తున్న కమిషనర్ ఎస్.వి.రమణారెడ్డి

పలమనేరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): పలమనేరు మున్సిపాలిటీలో శనివారం 97.05 శాతం మందికి సామాజిక పెన్షన్లు పంపిణీ చేసినట్లు మున్సిపల్ కమిషనర్ ఎస్.వి. రమణారెడ్డి తెలిపారు. మున్సిపాలిటీలో మొత్తం 4,549 మందికిగాను 4,415 మందికి శనివారం పెన్షన్లు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. తప్పిపోయిన వారికి ఆదివారం పంపిణీ చేయనున్నట్లు కమిషనర్ తెలిపారు.

సదుంలో కోతుల బెడద



సదుంలోని ఓ ఇంటి వద్ద వానరాలు

సదుం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): సదుం లో ఇళ్ల మధ్యనే రోజూ పదుల సంఖ్యలో కోతులు హల్‌చల్ చేస్తున్నాయి. కాస్త ఏమరుపాటుగా ఉంటే ఇళ్లలోకి చొరబడి చేతికందిన వస్తువులు, తినుబండారాలు తీసుకెళుతున్నాయి. కోతులు ఇళ్లల్లోని పిల్లలు, పెద్దలపై తిరగబడుతున్నాయి. పిల్లలు ఇంటి నుంచి బయటకు రాలేక భయాందోళనకు గురవుతున్నారు. తెల్లారకముందే వాకిట్లో వాలిపోవడంలో మహిళలు ఇళ్ల ముందు చెత్త శుభ్రం చేయడానికి సాహసం చేస్తున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వైభవంగా దోపోత్సవం



భక్తులతో కిటకిటలాడిన అగస్తీశ్వరస్వామి కొండ

పుంగనూరు రూరల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నెక్కుంది సమీపంలో వెలసిన అగస్తీశ్వరస్వామి ఆలయం వద్ద దోపోత్సవం శనివారం వైభవంగా జరిగింది. మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆలయ అర్చకులు ఉదయాన్నే స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. భక్తులకు అన్నదానం చేశారు. పుంగనూరు సీఐ శ్రీనివాసులు బందోబస్తు నిర్వహించారు. పుంగనూరు ఆర్టీసీ డిపో మేనేజర్ సుధాకరయ్య భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సు సర్వీసులు ఏర్పాటు చేశారు.

శ్రీవారి బ్రహ్మోత్సవ పోస్టర్ల ఆవిష్కరణ



శ్రీవారి బ్రహోత్సవ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఇన్‌స్పెక్టర్ మునీంద్రబాబు

పుంగనూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఈనెల 6 నుంచి 16వ తేదీ వరకు స్థానిక కోనేటి వద్ద వెలసిన కల్యాణ వెంకటరమణస్వామి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్ మునీంద్ర బాబు తెలిపారు. శనివారం స్థానిక ఆలయ ఆవరణలో బ్రహ్మోత్సవ పోస్టర్లను అర్చకులు శ్రీనివాసాచార్యులు, లక్ష్మీకాంతాచార్యులతో కలిసి ఆవిష్కరించారు. 6న సుప్రభాతం అభిషేకం, సర్వదర్శనం, సేనాధిపతి ఉత్సవాలు, అంకురార్పణ, తీర్థప్రసాదాలు, 7న ధ్వజారోహణం, పెద్దశేషవాహనం, 8న చిన్నశేషవాహనం, హంసవాహనం, 9న సింహ వాహనం, ముత్యపు పందిరి వాహనం, 10న కల్పవృక్ష వాహనం, హనుమంత వాహనం, 11న మోహినీ వాహనం, గరుడ వాహనం, 12న సూర్యప్రభ వాహనం, చంద్రప్రభ వాహనం, 13న కల్యాణోత్సవం, గజవాహనం, 14న శ్రీవారి రథోత్సవం, అశ్వవాహనం, 15న వసంతోత్సవం, ధ్వజావరోహణం, తిరుప్పావడ సేవ, శయనోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకోవాలని కోరారు.

విద్యార్థులకు విద్యాసామగ్రి వితరణ



విద్యాసామగ్రి అందజేస్తున్న వాసవీ క్లబ్ సభ్యులు

పుంగనూరు రూరల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులకు పరీక్షలకు అవసరమైన విద్యాసామాగ్రిని శనివారం వాసవీ క్లబ్ ప్రతినిధులు వితరణ చేశారు. జడ్పీ బాలికోన్నత పాఠశాలలోని విద్యార్థులకు బాసర పుణ్యక్షేత్రంలో పూజలు చేయించిన కంకణాలు, పెన్నులు, పెన్సిళ్లు, రబ్బరు తదితర వస్తువులను సంఘ సభ్యులు అందజేశారు. ప్రధానోపాధ్యాయురాలు రుద్రాణి, సంఘ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాత కేసుల్లో 13 మంది బైండోవర్

పుంగనూరు రూరల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): నాటుసారా పాత కేసుల్లో 13 మందిని తహసీల్దార్ రాము వద్ద బైండోవర్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ సురేశ్‌రెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని పట్టరపల్లె తాండాకు చెందిన రవీంద్రనాయక్, బుడ్డన్ననాయక్, రమణనాయక్, చిన్నరెడ్డెప్పనాయక్, బాలాజీనాయక్, చంద్రనాయక్, శంకర్‌నాయక్, గణేశ్‌నాయక్, మునిరాజనాయక్, శివాజీనాయక్, బాలాజీనాయక్, మునస్వామినాయక్‌లను అదుపులోకి తీసుకుని తహసీల్దార్ వద్ద హాజరు పరిచినట్లు పేర్కొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



మోడల్ కాలనీలో పింఛన్లు పంపిణీ చేస్తున్న పీఎస్‌ఎం తదితరులు

కుప్పం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): పేద బడుగు బలహీన వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం అన్నారు. కుప్పం పురపాలక సంఘం, మండలాల పరిధిలో శనివారం ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ జోరుగా సాగింది. ఇంటింటికీ వెళ్లి పీఎస్‌ఎం స్వయంగా పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలకు అండగా నిలుస్తుందని, నిస్సాయకులకు సంక్షేమ పథకాలతో ఆసరాగా ఉంటూనే, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడుపుతోందన్నారు. మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు. అలాగే కుప్పం మండలం మటార్లపల్లెలో సైతం ఐటీడీపీ ఉపాధ్యక్షుడు ఈఆర్పీ బాలాజీ, పంచాయతీ అధ్యక్షుడు మురళి, ప్రభ తదితరులు కార్యదర్శులతో కలిసి పింఛన్లు పంపిణీ చేశారు.

ఆసుపత్రిలో పింఛను సాయం



కల్లూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం రెడ్డివారిపల్లి పంచాయతీ తురకపేటకు చెందిన హైదర్ వల్లి అనారోగ్యంతో తిరుపతి రుయా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. శనివారం పంచాయతీ కార్యదర్శి బాలాజీ తన సొంత ఖర్చులతో రుయాకు చేరుకొని పింఛను నగదు రూ.4 వేలు అందించి సాయం చేశారు. దీంతో లబ్ధిదారుడు కార్యదర్శికి కృతజ్ఞతలు తెలిపారు.

సిమెంటు రోడ్డు పనులకు భూమిపూజ



రోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న ప్రేమ్‌కుమార్ తదితరులు

కుప్పం రూరల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చందం పంచాయతీ హరిజనవాడలో నూతనంగా మంజూరైన సిమెంటు రోడ్డు పనులను శనివారం మండల టీడీపీ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ భూమిపూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితవాడలను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకు వెళ్లడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు కృతనిశ్చయంతో ఉన్నారని చెప్పారు.

క్రీడలతోనే మానసికోల్లాసం



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ కంచెర్ల శ్రీకాంత్

శాంతిపురం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): క్రీడలతోనే మానసికోల్లాసం సాధ్యమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచెర్ల శ్రీకాంత్ అన్నారు. శనివారం శాంతిపురం మండలం గుండుశెట్టిపల్లె వద్ద క్రికెట్ పోటీలను టీడీపీ మండలాధ్యక్షులు భాష్యం విశ్వనాథనాయుడు, రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి డా.సురేష్‌బాబుతో కలిసి పోటీలను ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లోనూ యువత క్రీడలో రాణించాలని సీఎం చంద్రబాబు క్రీడలను ప్రోత్సహిస్తున్నారన్నారు. క్రీడా జట్టు సభ్యులను పరిచయం చేసుకుని టోర్నమెంటును ప్రారంభించారు. కార్యక్రమంలో నేతలు చంద్ర, మంజునాథ్, బాలు, ఉమాపతి, మునెప్ప, వేదశ్రీ, సరిత, రవి, శివ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత నేత్ర వైద్యశిబిరం

పలమనేరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): పలమనేరు రిక్రియేషన్ క్లబ్ ఆవరణలో ఈనెల 2న ఆదివారం ఉచిత నేత్ర చికిత్సా శిబిరం నిర్వహిస్తున్నట్లు క్లబ్ నిర్వాహకులు తెలిపారు. శిబిరంలో చెన్నై శంకర నేత్రాలయ వైద్యులు మురళి వైద్య పరీక్షలు నిర్వహిస్తారని, అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్లు చేస్తారని పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మోడల్ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

పుంగనూరు రూరల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అడవినాథునికుంట ఆదర్శపాఠశాలలో ఆరో తరగతిలో చేరడానికి దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రమా ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో చేరే విద్యార్థులు బీసీ, ఓబీసీలు రూ.150, ఎస్సీ, ఎస్టీలు రూ.75 ఫీజు చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఈనెల 31వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

టీడీపీ కార్యకర్త కుటుంబానికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న టీడీపీ నేతలు

రామకుప్పం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): బందార్లపల్లె పంచాయతీ లక్ష్మీపురానికి చెందిన టీడీపీ కార్యకర్త లక్ష్మమ్మ శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. శనివారం టీడీపీ మండలాధ్యక్షుడు ఆనందరెడ్డి స్థానిక నేతలతో కలిసి మృతురాలి కుటుంబసభ్యులను పరామర్శించారు. అనంతరం పార్టీ తరఫున వారికి రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో నేతలు చంద్రశేఖర్‌రెడ్డి, మురళీమోహన్, శ్రీనివాసులు, ఆనంద్, ఆంజినేయులు, మోహన్, శేఖర్, గిరి తదితరులు పాల్గొన్నారు.


నైపుణ్య కుప్పం..!



- యువతకు పుష్కలంగా ఉద్యోగావకాశాలు
- రేపు, ఎల్లుండి 1ఎం1బి స్కిల్ సెంటర్‌లో శిక్షణ
- 11న జాబ్ మేళా



ద్రావిడ వర్సిటీలో స్కిల్ సెంటర్ ప్రారంభిస్తున్న సీఎం చంద్రబాబు (ఫైల్ ఫొటో)



శిక్షణ పొందుతున్న యువత

కుప్పం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు సొంత నియోజకవర్గానికి ఇచ్చిన వరాలు సత్ఫలితాలను ఇచ్చే దిశగా కార్యాచరణ కొనసాగుతోంది. ముఖ్యంగా యువను ఉద్దేశించి ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనకు సంకల్పించిన ఆయన ద్రావిడ విశ్వవిద్యాలయంలో ప్రారంభించిన 1ఎం1బి గ్రీన్ స్కిల్స్ రెడినెస్ సెంటర్‌తో తొలి విడతలో సుమారు 500లకు పైగా యువత ఉద్యోగాకాశాలు పొందే మార్గం సాకరం కానుంది. కడా పీడీ వికాస్ మర్మత్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న కార్యాచరణ వివరాలు వివరాలు ఇవీ. ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ ఏడాది జనవరి నెల 6, 7 8 తేదీలలో మూడు రోజుల పాటు కుప్పంలో పర్యటించారు. ఆ సమయంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించారు. అందులో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనే ధ్యేయంగా ప్రారంభించిన 1ఎం1బి గ్రీన్ స్కిల్స్ రెడినెస్ సెంటర్ ఒకటి. ద్రావిడ విశ్వవిద్యాలయంలో ప్రారంభించిన ఈ స్కిల్ సెంటర్‌లో ప్రస్తుతం 30 మంది నిరుద్యోగ యువతీ యువకులు శిక్షణ పొందుతున్నారు. కేవలం మూడునాలుగు నెలల శిక్షణ ఇవ్వడమే కాక, ఒకట్రెండు రోజుల పరిమిత శిక్షణతో నిరుద్యోగ యువతను ఉద్యోగాలకు జరిగే ఇంటర్వ్యూలకు సన్నద్ధులు చేయడమనే కర్తవ్యం ఈ స్కిల్ సెంటర్ బాధ్యతల్లో ప్రస్తుతం భాగమైంది. అటువంటి శిక్షణ ఈనెల 3, 4 తేదీల్లో 1ఎం1బి గ్రీన్ స్కిల్స్ రెడినెస్ సెంటర్‌లో ఇవ్వనున్నారు. ఉత్సాహం కలిగిన నిరుద్యోగ యువత ద్రావిడ విశ్వవిద్యాలయంలోని స్కిల్ సెంటర్‌లో తమ పేర్లను నమోదు చేసుకోవాలి.

ఇలా నమోదు చేసుకున్నవారికి నిర్దేశిత తేదీల్లో ఉద్యోగాలకు హాజరయ్యేందుకు అవసరమైన శిక్షణ ఇస్తారు. రెజ్యూమ్ తయారు చేయడం, డాక్యుమెంటేషన్ చేయడం, మాక్ ఇంటర్వ్యూకు హాజరు కావడం, సాఫ్ట్ స్కిల్స్, ప్రొఫెషనల్ గ్రూమింగ్ తదితర అంశాలపై ఈ రెండు రోజుల శిక్షణ ఉంటుంది. పదో తరగతి, డిప్లమో, ఏదైనా డిగ్రీ కలిగిన నిరుద్యోగ యువత ఎవరైనా సరే ఈ శిక్షణ తీసుకునేందుకు అర్హులు.

● 11న జాబ్ మేళా

1ఎం1బి గ్రీన్ స్కిల్స్ రెడినెస్ సెంటర్‌లో శిక్షణ పొందిన వారికి ఈనెల 11వ తేదీన ప్రత్యేకంగా మినీ జాబ్ మేళా నిర్వహిస్తారు. బీఎఫ్ఎస్ఐ సేల్స్ - క్రెడిట్ కార్డ్ సేల్స్, మాన్యుఫ్యాక్చరింగ్ మెషీన్ మెయింటెనెన్స్, మాన్యుఫ్యాక్చరింగ్ ఈఎంఎస్ ఆపరేటర్స్, రిటైల్ సేల్స్ అసోసియేట్, సేల్స్ ప్రమోటర్స్ - లాంగ్ ఆర్మ్ సేల్స్, బిల్డింగ్ మెటీరియల్ సేల్స్, టెలికామ్ సేల్స్ - బీ2బి అండ్ ఎంటర్‌ప్రైజ్ సేల్స్, డేటా లేబరల్ - ఐటీఈఎస్ రంగాలకు చెందిన కంపెనీలు ఈ జాబ్ మేళాలో పాల్గొని ఆయా ఉద్యోగాలకు యువతను ఎంపికచేసుకుంటాయి. ప్రస్తుతం 1ఎం1బి గ్రీన్ స్కిల్స్ రెడినెస్ సెంటర్‌లో నైపుణ్య శిక్షణ పొందుతున్న నిరుద్యోగ యువతకు ప్రఖ్యాత కంపెనీలలో ఉద్యోగావకాశాల కోసం మరోసారి జాబ్ మేళా నిర్వహించనున్నారు. ఈ మినీ జాబ్ మేళాలలో సుమారు 500లకు పైగా ఉద్యోగావకాశాలు ఉన్నట్లు కడా పీడీ వికాస్ మర్మత్ తెలిపారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిరుద్యోగ యువతను ఆయన కోరారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం



కల్లూరు : నందవనంలో పరీక్ష కేంద్రంలోకి వెళుతున్న విద్యార్థులు



పుంగనూరు బసవరాజ బాలుర కాలేజీలో పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

కల్లూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం ఎల్లంకివారిపల్లి నందవనం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. మొదటిరోజు పరీక్షకు 161 మంది విద్యార్థులు హాజరుకాగా ఇద్దరు గైర్హాజరైనట్లు పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ తులసీరాం, డిపార్టుమెంటల్ అధికారి గౌతమ్ తెలిపారు.

● చౌడేపల్లె: చౌడేపల్లెలోని అన్ని కేంద్రాల్లో 160 మంది విద్యార్థులు ఇంటర్ పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా.. 122 మంది హాజరయ్యారు. 38 మంది గైర్హాజరయ్యారు.

● సోమల: సోమల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం 108 మంది హాజరు కావాల్సి ఉండగా 19 మంది గైర్హాజరయ్యారని ప్రిన్సిపాల్ గంగాధరంనాయుడు తెలిపారు.

● పలమనేరు: పలమనేరులో శనివారం జరిగిన ఇంటర్ పరీక్షలకు 133 మంది గైర్హాజరయ్యారు. పలమనేరులో మొత్తం 7 పరీక్ష కేంద్రాల్లో 2,994 మంది పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా.. 2,859 మంది మాత్రమే హాజరయ్యారని అధికారులు తెలిపారు.

●పుంగనూరు రూరల్: పుంగనూరులో ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు పరీక్షల కస్టోడియన్ అధికారులు మురళీధర్, కమలాకర్ తెలిపారు. శనివారం పట్టణంలోని రెండు కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించగా 812 మందికిగాను.. 736 మంది మాత్రమే పరీక్షలకు హాజరైనట్లు పేర్కొన్నారు.

● వి.కోట: వి.కోటలో మొదటి సంవత్సరం ఇంటర్ పరీక్షలకు 643 మంది హాజరైనట్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బాలకృష్ణారెడ్డి తెలిపారు. వి.కోటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రంలో 387 మందికి గాను 357 మంది హాజరుకాగా.. 30 మంది గైర్హాజరయ్యారు. అలాగే వాణి జూనియర్ కళాశాల కేంద్రంలో 313 మందికిగాను 286 మంది పరీక్షలు రాయగా.. 27 మంది గైర్హాజరైనట్లు తెలిపారు.

టీకాలతోనే బ్రూసెల్లోసిస్ వ్యాధి నివారణ



పశువులకు టీకాలు వేస్తున్న పశుసంవర్ధక సహాయ సంచాలకులు మనోహర్

పుంగనూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): టీకాలతోనే బ్రూసెల్లోసిస్ వ్యాధిని నిరోధించడానికి అవకాశం ఉంటుందని పశుసంవర్ధక సహాయ సంచాలకులు మనోహర్ తెలిపారు. శనివారం పట్టణ సమీపంలోని హనుమంతరాయదిన్నెలో పశువులకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులకు జ్వరం రావడం, బలహీనతగా ఉండటం, చూలు ఆఖరి దశలో గర్భస్రావం, మాయ వేయకపోవడం, చూలు నిలవకపోవడం, మగపశువులలో వృషణాల వాపులు, కీళ్ల వాపు తదితర లక్షణాలు కనబతాయన్నారు. వ్యాధి సోకిన పశువుల గర్భస్రావాలు, పాల నుంచి ఇతర జంతువులకు వ్యాప్తి చెందుతాయన్నారు. వ్యాధి సోకిన పశువుల నుంచి మనుషులకు సోకుందన్నారు. వ్యాధిపై రైతులు జాగ్రత్తగా వ్యవహరించాలని కోరారు.

మాదిగ అమరవీరులకు నివాళులు



సోమలలో మాదిగ అమరవీరులకు నివాళులర్పిస్తున్న నాయకులు



పుంగనూరు: అంబేడ్కర్ సర్కిల్ వద్ద నివాళులర్పిస్తున్న మాదిగ సంఘ నాయకులు

సోమల, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): సోమల బస్టాండ్‌లో మాదిగ అమరవీరులకు ఆ సంఘ నాయకులు శనివారం నివాళులర్పించారు. రాష్ట్ర ఎమ్మార్పీఎస్ సహాయ కార్యదర్శి మాటూరి మురళీ మాట్లాడుతూ గత 30 ఏళ్లుగా ఎమ్మార్పీఎస్ ఉద్యమంలో అసువులు బాసిన అమరవీరుల త్యాగాలను కొనియాడారు. కార్యక్రమంలో ఆ సంఘ నాయకులు మంద రామనాథం, ప్రభు కుమార్, ప్రకాశ్, మొగిలేశ్వర్, రవి, శుభకర్, వెంకటరామయ్య, పెద్దబ్బ, మోహన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

●పుంగనూరు: ఎస్సీ వర్గీకరణ కోసం ప్రాణాలు తీసుకున్న అమరవీరులకు శనివారం ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ కన్వీనర్ నరసింహులు ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు శంకర్, రెడ్డెప్ప, ప్రభాకర్, వెంకటరమణ, మురళీ, మహేష్, చెంగ్రాయప్ప, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆయిమాత ఆలయ వార్షికోత్సవం



అమ్మవారికి కలశాలను తీసుకెళుతున్న మహిళలు

వి.కోట, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): వి.కోటలో వెలసిన ఆయిమాత ఆలయంలో అమ్మవారి జయంతోత్సవాలను సీర్వీ సమాజ్ సభ్యులు అత్యంత వైభవంగా నిర్వహించారు. శనివారం అమ్మవారి ఆలయం నిర్మించి పదేళ్లు పూర్తయిన సందర్భంగా 81 మంది మార్వాడీ మహిళలు నిష్ఠతో అమ్మవారికి కలశాలను ప్రదర్శనగా తీసుకొచ్చారు. ఆలయంలో అమ్మవారికి కలశాభిషేకం నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. గీతాలాపన, సాంప్రదాయ నృత్యాలతో సందడి నెలకొంది.

టీడీపీ ఎంపీటీసీ రాజీనామా



ఎంపీడీవో ఖాదర్‌బాషాకు రాజీనామా లేఖను అందిస్తున్న ఎంపీటీసీ లక్ష్మీనారాయణ

పలమనేరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): కొలమాసనపల్లి-2 ఎంపీటీసీ లక్ష్మీనారాయణ శనివారం తన పదవికి రాజీనామా చేశారు. తన రాజీనామా లేఖను ఎంపీడీవో ఖాదర్‌బాషాకు అందించారు. టీడీపీ అధికారంలోకి వచ్చినా ఆయనకు గుర్తింపు ఇవ్వలేదన్న కారణంగానే పదవికి రాజీనామా చేసినట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం సాగుతోంది.

పోలీసు స్టేషన్‌కు హాజరైన వెంకటేగౌడ

పలమనేరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): పలమనేరు మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడపై నమోదు అయిన కేసులో బెయిల్ పొందిన ఆయన శనివారం కోర్టు ఆదేశాల మేరకు పలమనేరు స్టేషన్‌కు వచ్చి సంతకాలు చేశారు. ఆయనతో పాటు పలువురు వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మెడికో దుర్మరణం

చిత్తూరు విద్యార్థినికి తీవ్రగాయాలు

ఇబ్రహీంపట్నం(విజయవాడ), మార్చి 1 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ వైద్య విద్యార్థిని దుర్మరణం చెందగా, మరో విద్యార్థిని తీవ్ర గాయాలపాలైంది. ఈ ప్రమాదం హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిలోని జూపూడి వద్ద శనివారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. స్థానిక నిమ్రా మెడికల్ కాలేజీలో గుంటూరులోని శ్యామలానగర్‌కు చెందిన సయ్యద్ తాజ్ అఫ్సా (20) మూడో సంవత్సరం, చిత్తూరు పట్టణం దుర్గానగర్‌కు చెందిన అర్షా మెహవిష్ (21) నాల్గవ సంవత్సరం చదువుతున్నారు. వీరు పశ్చిమ ఇబ్రహీంపట్నంలోని ఓ ప్రైవేట్ హాస్టల్‌లో ఉంటూ స్కూటీపై కాలేజీకి వెళ్తారు. రోజూ మాదిరిగానే శనివారం బయల్దేరారు. కళాశాల వద్ద యూటర్న్ తీసుకుంటున్న వీరిని హైదరాబాద్ వైపు నుంచి వస్తున్న కారు వేగంగా ఢీకొంది. ప్రమాదంలో తాజ్ అఫ్సా అక్కడికక్కడే దుర్మరణం చెందగా, మెహవిష్ తీవ్రంగా గాయపడింది. మెహవిష్‌ను చికిత్స నిమిత్తం నిమ్రాకు తరలించారు. చికిత్స తర్వాత మెరుగైన వైద్యం కోసం విజయవాడలోని ఓ ప్రైవేట్ కాలేజీకి తీసుకెళ్లారు.

అనుమానాస్పదంగా కనిపిస్తే సమాచారం ఇవ్వండి: సీఐ

చిత్తూరు అర్బన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని రెండో పట్టణ సీఐ నెట్టికంఠయ్య కోరారు. శనివారం ఆయన ఒక సీసీ ఫుటేజీని విడుదల చేశారు. అందులో కొందరు మారణాయుధాలతో తిరుగుతున్నారు. అప్రమత్తమైన పోలీసులు నైట్ బీట్‌ను పెంచడంతోపాటు ప్రజలకు సూచనలిచ్చారు. తమ వీధుల్లో కొత్త వ్యక్తులు, భాషరానివారు అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని సీఐ సూచించారు. ప్రజలు కూడా సహకరించాలన్నారు.

'స్వచ్ఛమైన తాగునీరందించడమే అపోలో లక్ష్యం'


వెంకటాపురంలో వాటర్ ప్లాంట్ ప్రారంభిస్తున్న అపోలో హాస్పిటల్స్ డైరెక్టర్ నరోత్తమ రెడ్డి

తవణంపల్లె, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలన్నదే తమ లక్ష్యమని అపోలో హాస్పిటల్స్ డైరెక్టర్ నరోత్తమ రెడ్డి అన్నారు. చైర్మన్ ప్రతాప్ సీ రెడ్డి అరగొండలో ఏర్పాటు చేసిన అక్షయ ధార పథకంలో భాగంగా శనివారం గల్లా వాళ్ల ఊరు, తడకర వెంకటాపురంలో మినరల్ వాటర్ ప్లాంట్లను ఆయన ప్రారంభించారు. ఇప్పటికే 20 గ్రామాల్లో వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు. సంపూర్ణ ఆరోగ్యం సీఈవో రాంబాబు, అపోలో ఫార్మసీ బీజీఎం సత్యారెడ్డి, జడ్పీటీసీ భారతి, గాంధీబాబు, జొన్నగురకల రాజశేఖర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల్లేకుండా క్వారీలు నడుపుకోండి: డీఎస్పీ


క్వారీల యజమానులతో మాట్లాడుతున్న డీఎస్పీ అజీజ్

నగరి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): నగరి మున్సిపల్ పరిధిలోని క్వారీల యజమానులతో డీఎస్పీ అజీజ్ శనివారం సమావేశం నిర్వహించారు. పేలుళ్లకు వాడుతున్న పదార్థాలపై ఆరా తీశారు. క్వారీల వల్ల స్థానికంగా ఎవరికీ ఎటువంటి సమస్యలు తలెత్తకుండా నడుపుకోవాలని సూచించారు. ఏదైనా ప్రమాదం సంభవిస్తే యజమానులు బాధ్యత వహించాలని స్పష్టం చేశారు.

పంచభూత మహాయాగం



నగరి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): నగరి ఏకాంబరకుప్పం కోదండరామస్వామి ఆలయంలో సంక్రాంతి రోజున పంచభూత మహా పూజలు ప్రారంభమైన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా శనివారం పంచభూత మహాయాగాన్ని నిర్వహించడంతో ఈ పూజలు ముగిశాయి. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. తంజావూరు, తిరువణ్ణామలై నుంచి వచ్చిన వేదపండితులు, నిర్వాహకులు సత్యనారాయణ, మోహన్, వేలాయుధం, రాజ, గ్రామస్థులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ



వెదురుకుప్పం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం ఆర్కేవీబీపేట జడ్పీ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు శనివారం దాతలు ఇచ్చిన విద్యా సామగ్రిని హెచ్‌ఎం అరుణకుమారి పంపిణీ చేశారు. వంద శాతం ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. అలాగే గత విద్యా సంవత్సరంలో టెన్త్ ఫలితాల్లో మొదటి నుంచి మూడు స్థానాల్లో నిలిచిన సత్య, చైతన్య, జయచంద్రకు నగదు బహుమతులను ప్రదానం చేశారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



క్రీడాకారుడికి ట్రోఫీ అందజేస్తున్న ఎంఈవోలు

వెదురుకుప్పం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలని కార్వేటినగరం ఎంఈవోలు విజయకుమార్, మనోజ్‌కుమార్ సూచించారు. శనివారం కార్వేటినగరం ఆర్కేఎస్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో క్రీడా దినోత్సవం హెచ్‌ఎం కోటేశ్వరరావు అధ్యక్షత నిర్వహించారు. విజేతలకు ఎంఈవోలు బహుమతులను ప్రదానం చేశారు.

గువ్వకల్లులో నలుగురిని కరిచిన పిచ్చికుక్క

చిత్తూరు రూరల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు రూరల్ మండలంలోని గువ్వకుల్లు గ్రామంలో శనివారం పిచ్చికుక్క స్వైర విహారం చేసింది. ఓ చిన్నారితోపాటు ముగ్గురిని కరిచింది. గ్రామస్థులు అప్రమత్తమై ఆ పిచ్చికుక్కను ఊరికి దూరంగా తరిమికొట్టారు. గాయపడిన వారు చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో రేబీస్ వ్యాక్సిన్లు వేయించుకున్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

- మాజీ ఎమ్మెల్యేలు సునీల్, లలితకుమారి

బంగారుపాళ్యం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): వైసీపీ కార్యకర్తలకు అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ సునీల్ కుమార్, లలితకుమారి అన్నారు. శనివారం పాలేరు గ్రామంలోని కల్యాణ మండపంలో జరిగిన వైసీపీ కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో వారు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామచంద్రారెడ్డి, సోమశేఖర్, శిరీష్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధితులపై చంద్రబాబు వరాల జల్లు



పరదేశి కుటుంబీకులతో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు - ముఖ్యమంత్రికి గజమాలతో టీడీపీ శ్రేణుల స్వాగతం

గంగాధరనెల్లూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): గంగాధరనెల్లూరు పర్యటనలో బాధితులపై సీఎం చంద్రబాబు శనివారం వరాల జల్లు కురిపించారు. బీసీ కాలనీలో అవ్వాతాతలైన సెల్వి, వాసుల వద్ద ఉంటున్న తల్లిదండ్రులు లేని రక్షిత, హేమశ్రీలను పరామర్శించారు. వారి సాధకబాధలు అడిగితెలుసుకున్నారు. తర్వాత సెల్వి పేరుతో మూడు సెంట్ల ఇంటిపట్టా మంజూరు చేయడంతోపాటు ఏడాది లోపు ఇంటినిర్మాణం పూర్తి చేసి వారి కుటుంబానికి అందివ్వనున్నట్లు చెప్పారు. మిషన్‌వాత్సల్య పథకం ద్వారా బాలికలిద్దరికీ 18 ఏళ్ల నిండేవరకు ప్రతి నెలా రూ. 2వేల వంతున వారి అకౌంట్‌లో డబ్బు జమచేసేలా చర్యలు తీసుకున్నారు. అలాగే బాలికలపేరుతో ఒక్కొక్కరికి రూ.2లక్షల వంతున ఫిక్స్‌డ్ డిపాజిట్ వేయనున్నట్లు హామీ ఇచ్చారు. వారి జీవనాధారం కోసం పాడిఆవులు నాలుగు ఇవ్వనున్నట్లు ప్రకటించారు. అనంతరం వాసుకు ఎన్టీఆర్ భరోసా పింఛన్ నిధులు పంపిణీచేశారు.

పరదేశి కుటుంబానికి చేయూత

గంగాధరనెల్లూరు దళితవాడలోని పరదేశి, నరసింహ కుటుంబానికి సీఎం ఆర్థికంగా చేయూత అందించారు. వారింటికెళ్లి సమస్యలను అడిగితెలుసుకున్నారు. పరదేశి పేరుతో 3సెంట్ల ఇంటిపట్టాతో పాటు ఇల్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. నరసింహ కుమార్తె ప్రియాంక ఆర్థిక ఇబ్బందుల వల్ల ఇంటర్మీడియట్ ఫస్ట్ ఇయర్ మధ్యలోనే ఆపేసిందని తెలుసుకుని విద్యాభ్యాసం కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను ఆదేశించారు. కుటుంబ జీవనాధారం కోసం పాడిఆవులు నాలుగు ఇవ్వనున్నట్లు సీఎం హామీ ఇచ్చారు. వారింట్లో ఉన్న వసంతమ్మకు ఎన్టీఆర్ భరోసా పింఛన్ నిధులు అందజేశారు.

దివ్యాంగుడికి ఫింఛన్ సొమ్ము అందజేత

స్టాల్స్ పరిశీలనకు సీఎం వచ్చినప్పుడు అక్కడ మోతరంగనపల్లె గ్రామానికి చెందిన దివ్యాంగుడు మురళీశ్వరరెడ్డి ఉండటాన్ని గమనించారు. ఇంకా ఎన్టీఆర్ భరోసా పింఛను నిధులు తీసుకోలేదని తెలిసి సీఎం అందజేశారు. చంద్రబాబు అంటే తనకు ఎంతో అభిమానమని, ఆయన చేతులమీదుగా పింఛను అందుకోవడం సంతోషంగా ఉందని మురళీశ్వరరెడ్డి తెలిపారు.

గజమాలతో బాబుకు స్వాగతం

సీఎంకు పలువురు టీడీపీ నేతలు క్రేన్ సాయంతో గజమాలను వేసి ఘనస్వాగతం పలికారు. జిల్లా తెలుగుయువత మాజీ కార్యనిర్వాహక కార్యదర్శి దేవపత్ని ధనంజయనాయుడు, పెద్దకాల్వకు చెందిన వ్యాపారవేత్త దీపక్‌నాయుడు, టీడీపీ నేతలు ప్రసాదనాయుడు, హరి చౌదరి, సునీల్‌కుమార్, దేవపత్ని కిరణ్‌నాయుడు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రిని కలిసిన పెనుమూరు టీడీపీ నేతలు


చంద్రబాబు సమక్షంలో ఆటో పంపిణీ చేస్తున్న ఈశ్వర్‌ప్రసాద్

పెనుమూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): జీడీ నెల్లూరుకు విచ్చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబును పెనుమూరు టీడీపీ నాయకులు కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ రైతు అధ్యక్షుడు ఈశ్వర్‌ప్రసాద్ సీఎం చేతుల మీదుగా ఓ వ్యక్తికి ఆటోను విరాళంగా అందజేశాడు. సీఎంకు టీడీపీ మండల అధ్యక్షుడు రుద్రయ్యనాయుడు పుష్పగుచ్ఛం అందించారు. పార్టీ నాయకుల సమావేశంలో తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు కార్లాల అరుణ మాట్లాడుతూ.. బూత్, క్లస్టర్ ఏజెంట్ల ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు నిర్వహిస్తే పార్టీ మరింత బలోపేతం అవుతుందని సీఎంకు విన్నవించారు. నాయకులు తలారి రెడ్డెప్ప, భాస్కర్, అశోక్, పరమేశ్వర్‌రెడ్డి, రాజగోపాల్‌నాయుడు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

స్టాళ్లను పరిశీలించిన సీఎం


స్టాల్ నిర్వాహకుడి నుంచి వివరాలు తెలుసుకుంటున్న సీఎం చంద్రబాబు, పక్కన ప్రభుత్వ విప్ థామస్, కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎంపీ ప్రసాదరావు

గంగాధరనెల్లూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): గంగాధరనెల్లూరు ప్రజా వేదిక సమీపంలో వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను సీఎం చంద్రబాబు పరిశీలించారు.

● జిల్లా నీటి యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో హార్టికల్చర్ ప్లాంటేషన్, ఫారంపాండ్, స్త్రీనిధి, జీవనోపాధి రుణాలు, లక్‌పతి దీదీ, ఉన్నతి, వడ్డీలేని రుణం, ఎన్టీయార్ భరోసా, హౌసింగ్ పురోగతికి సంబంధించిన వివరాలను పరిశీలించారు. ● పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పశుసంతతి పరిశీలన పథకం, గోకుల్ మిషన్, వ్యవసాయంలో డ్రోన్ల వినియోగం, అధిక ప్రోటీన్ విలువల కలిగిన వరి రకాలను పరిశీలించారు. ● పంచాయతీరాజ్ ఇంజనీరింగ్‌శాఖ, నేషనల్ హైవే అధికారులు వేసిన రోడ్ల మరమ్మతులకు సంబంధించిన ఫొటోలను తిలకించారు. ● డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తెల్ల జిల్లేడుతో చేసిన బొమ్మలను, టెర్రకోట బొమ్మలను, మామిడి ఎగుమతులు, పశుగణాభివృద్ధి స్టాళ్లను పరిశీలించి, వివరాలను అడిగి తెలుసుకున్నారు. ● పీఎం విశ్వకర్మ యోజన జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా కార్యక్రమాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కంప్యూటర్ ఎంబ్రాయిడింగ్ ద్వారా సీఎం ఫొటో, టీడీపీ లోగోను మారేడుపల్లెకు చెందిన అమృత తయారు చేసి సీఎంకు అందించారు. ● ఉద్యాన, గ్రౌండ్‌వాటర్, వాటర్ ఆడిట్ శాఖల ఆధ్వర్యంలో డ్రిప్ సిస్టంను పరిశీలించారు. ● పంచాయతీరాజ్‌శాఖ వారిచే చెత్త నుంచి సంపద తయారీ, వర్మి కంపోస్టు విక్రయ కేంద్రాలను పరిశీలించారు. ● పీఎం సూర్యఘర్ యోజన ద్వారా గ్రిడ్ కనెక్టెడ్ సోలార్ రూఫ్ టాప్‌నెట్ మీటర్ సిస్టంను పరిశీలించారు. ● విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ ద్వారా 20 మందికి ల్యాప్‌టాప్‌లు, రూ.1.45 లక్షల విలువ కలిగిన రెండు స్కూటర్లను పంపిణీ చేశారు.

ప్రజా సమస్యలను పరిష్కరించండి

అధికారులకు ఎమ్మెల్యే జగన్మోహన్ ఆదేశం


బాధితుడి అర్జీని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్

చిత్తూరు సిటీ, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): సకాలంలో ప్రజా సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ ఆదేశించారు. శనివారం లక్ష్మీనగర్ కాలనీలోని తన కార్యాలయంలో 'ప్రజాదర్బార్' నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రజలు అందించే అర్జీలపై పలు సమస్యలను అప్పటికప్పుడే పరిష్కరిస్తున్నామని చెప్పారు. మౌలిక సదుపాయాలకు సంబంధించి నిధుల అందుబాటును బట్టి ప్రాధాన్య క్రమంలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. మొత్తం 29 అర్జీలు వచ్చాయని, సత్వరం పరిష్కరించేందుకు కృషిచేస్తామన్నారు. చుడా చైర్‌పర్సన్ కటారి హేమలత, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మేయర్ అముద, సహాయ కమిషనర్ ప్రసాద్, తహసీల్దార్ జయంతి, ఎంపీడీవో శివరాజ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వెలుగు సీసీలను నియమించండి

గుడిపాల: వెలుగు సీసీలను నియమించాలని ఎమ్మెల్యే జగన్మోహన్‌ను శనివారం గుడిపాల నాయకులు కలిసి విన్నవించారు. పీడీతో మాట్లాడి వెంటనే సీసీలను నియమించాలని ఆదేశించారు. మాజీ జడ్పీటీసీ బాలాజి నాయుడు, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి హేమాద్రినాయుడు, మాజీ ఎంపీటీసీ తుమ్మల సాంబశివ నాయుడు, ఎస్సీసెల్ నాయకుడు గోపి, రామూర్తి నాయుడు పాల్గొన్నారు.

వైభవంగా ఏకాంబరేశ్వరుడి రథోత్సవం


ఏకాంబరేశ్వరుడు, కామాక్షి అమ్మవారు, త్రిశూలం


రథంపై విహరిస్తున్న ఏకాంబరేశ్వరుడు

యాదమరి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): త్రివేణి సంగమంలోని ఏకాంబరేశ్వర కామాక్షి అమ్మవారి ఆలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు కన్నులపండుగగా జరుగుతున్నాయి. శనివారం ఉదయం స్వామివారిని ప్రత్యేక పుష్పాలతో అలంకరించి.. రథంపై అధిష్ఠింపజేసి పుర వీధుల్లో ఊరేగించారు. రథోత్సవానికి ఉభయదారులుగా సురేంద్రరెడ్డి, భాస్కర్ రెడ్డి, మురళీ రెడ్డి, జీవన్ రెడ్డి తదితరులు వ్యవహరించారు.

త్రిశూల స్నానం: సాయంత్రం త్రిశూల స్నానం కార్యక్రమాన్ని ఆలయ మండపంలో ఉభయదారులు మురుగేశన్, గోపి, హరీష్, అర్చకుడు కాసలనాటి చంద్రశేఖర్ శాస్త్రి శాస్త్రోక్తంగా నిర్వహించారు.

కలియుగ రావణ బ్రహ్మ వాహనసేవ: రాత్రి యాదమరి వన్నియకుల క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో మేళతాళాలు, బాణసంచా నడుమ కలియుగ రావణ బ్రహ్మ వాహనసేవ నిర్వహించారు. తొమ్మిది రోజులుగా జరుగుతున్న బ్రహ్మోత్సవాలు ఆదివారం పుణ్యకోటి విమానం, ధ్వజావరోహణంతో ముగియనున్నాయి.



అంకాల పరమేశ్వరి ఊరేగింపు

చిత్తూరు కల్చరల్, మార్చి1 (ఆంధ్రజ్యోతి): గిరింపేట న్యూ బాలాజి కాలనీలోని అంకాల పరమేశ్వరిని ఆలయ నిర్వాహకులు రోషిణి, భక్త బృందం ఆధ్వర్యంలో శనివారం ఊరేగించారు. అంతకుముందు జరిగిన పూజల్లో ఎమ్మెల్యే తండ్రి గురజాల చెన్నకేశవులు నాయుడు, ఉభయదారులు పాల్గొన్నారు.

వన వేణుగోపాలుడికి పూజలు

వెదురుకుప్పం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): దేవరగుడిపల్లె-ఆడారెడ్డిపల్లె సమీపంలో ఉన్న వన వేణుగోపాలస్వామికి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. పరిసర గ్రామాల భక్తులు స్వామిని దర్శించుకున్నారు. ఏర్పాట్లను ప్రధాన కార్యనిర్వాహకులు శివకుమార్ పర్యవేక్షించారు.

సంక్షిప్తంగా..

నేడు పెనుమూరు మండల సమావేశం

పెనుమూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): పెనుమూరు మండల సర్వసభ్య సమావేశం ఆదివారం ఉదయం 10.30 గంటలకు ఎంపీడీవో కార్యాలయంలో జరగనుంది. ఈ మేరకు ఎంపీడీవో నీలకంఠేశ్వర్‌రెడ్డి తెలిపారు.

ట్రాన్స్‌కో ఏఈగా శివకుమార్

గుడిపాల, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): గుడిపాల ట్రాన్స్‌కో ఏఈగా శివకుమార్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఈయన చిత్తూరులో సబ్ ఇంజనీర్‌గా పనిచేస్తూ పదోన్నతిపై గుడిపాలకు ఏఈగా నియమితులయ్యారు.

క్రీడాకారిణికి సన్మానం



బంగారుపాళ్యం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): బంగారుపాళ్యం ప్రభుత్వ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న జాస్మిన్.. రాష్ట్ర స్థాయిలో బాస్కెట్‌బాల్ పోటీల్లో రాణించింది. దీంతో ఆమెను ముస్లిం జేఏసీ ఆధ్వర్యంలో శనివారం సన్మానించారు. జిల్లా అధ్యక్షుడు షేక్ ఫిరోజ్ అహ్మద్ రూ.10వేలను అందజేశారు. సభ్యులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

విజయపురం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): పాతార్కాడు ప్రాథమిక పాఠశాల ఆవరణంలో ఆదివారం ఉదయం 10 నుంచి ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఈ మేరకు అంతర్జాతీయ వాకర్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ రవిరాజు తెలిపారు. గుండె, నరాలు, కంటి, ఎముకల విభాగానికి చెందిన వైద్యులు విచ్చేస్తున్నారన్నారు.

క్షతగాత్రుడికి రోజా పరామర్శ

విజయపురం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మాధవరంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి విశ్రాంతి తీసుకుంటున్న బాబు కుమారుడు స్టైన్‌ను శనివారం మాజీ మంత్రి ఆర్కే రోజా పరామర్శించారు. వైసీపీ నేతలు శివరాజు, గుణశేఖర్‌రెడ్డి, మంజు బాలాజీ, శ్యాంలాల్, శేఖర్‌రాజు, శ్రీరాములు రెడ్డి, జిల్లు దాసు,అరుణాచలం తదితరులు పాల్గొన్నారు.

వీధి దీపాల ఏర్పాటు

గుడిపాల, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): రామభద్రాపురం దళితవాడ ఎక్స్‌టెన్షన్‌కు వీధి దీపాలను ఎమ్మెల్యే జగన్మోహన్ సహకారంతో సర్పంచ్ గోళ్ల హరిణి ఏర్పాటు చేశారు. ఐదేళ్లుగా స్థానికుల సమస్యను తెలియజేస్తూనే ఉన్నా.. గత ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందని చెప్పారు. ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా, ఆయన వెంటనే సమస్యను పరిష్కరించారన్నారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

బంగారుపాళ్యం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మార్కెట్ యార్డు సమీపంలోని ఎన్‌పీసీ నాయుడు పార్క్‌లో ఆదివారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించనున్నారు. ఈ మేరకు మాజీ ఎమ్మెల్యే వెంకటేశ్వర చౌదరి తెలిపారు. తిరుపతికి చెందిన అరవింద కంటి ఆస్పత్రి వైద్యులు వస్తారని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మెడికో దుర్మరణం

చిత్తూరు విద్యార్థినికి తీవ్రగాయాలు

ఇబ్రహీంపట్నం(విజయవాడ), మార్చి 1 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ వైద్య విద్యార్థిని దుర్మరణం చెందగా, మరో విద్యార్థిని తీవ్ర గాయాలపాలైంది. ఈ ప్రమాదం హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిలోని జూపూడి వద్ద శనివారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. స్థానిక నిమ్రా మెడికల్ కాలేజీలో గుంటూరులోని శ్యామలానగర్‌కు చెందిన సయ్యద్ తాజ్ అఫ్సా (20) మూడో సంవత్సరం, చిత్తూరు పట్టణం దుర్గానగర్‌కు చెందిన అర్షా మెహవిష్ (21) నాల్గవ సంవత్సరం చదువుతున్నారు. వీరు పశ్చిమ ఇబ్రహీంపట్నంలోని ఓ ప్రైవేట్ హాస్టల్‌లో ఉంటూ స్కూటీపై కాలేజీకి వెళ్తారు. రోజూ మాదిరిగానే శనివారం కూడా బయల్దేరారు. కళాశాల వద్ద యూటర్న్ తీసుకుంటున్న వీరిని హైదరాబాద్ వైపు నుంచి వస్తున్న కారు వేగంగా ఢీకొంది. ప్రమాదంలో తాజ్ అఫ్సా అక్కడికక్కడే దుర్మరణం చెందగా, మెహవిష్ తీవ్రంగా గాయపడింది. గాయపడిన మెహవిష్‌ను చికిత్స నిమిత్తం నిమ్రాకు తరలించారు. ప్రాథమిక చికిత్స తర్వాత మెరుగైన వైద్యం కోసం విజయవాడలోని ఓ ప్రైవేట్ కాలేజీకి తీసుకెళ్లారు.

నా కుమారుడిని చంపేశారు?

కుమార్తెనైనా ప్రాణాలతో అప్పగించేలా చర్యలు తీసుకోండి

కుటుంబీకులతో కలిసి రోడ్డెక్కిన తండ్రి

వెదురుకుప్పం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): 'నా కుమారుడిని చంపేశారు. కుమార్తెనైనా ప్రాణాలతో అప్పగించేలా చర్యలు తీసుకోండి' అని కార్వేటినగరం మండలం కొల్లాగుంట కాలనీకి చెందిన కిరణ్ విజ్ఞప్తి చేశారు. శనివారం తన కుటుంబీకులతో కలిసి చిత్తూరు-పుత్తూరు జాతీయ రహదారిపై నిరసన తెలిపారు. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కిరణ్.. తమిళనాడులోని పళ్లిపట్టుకు చెందిన నిషాను పదేళ్ల కిందట కులాంతర వివాహం చేసుకున్నాడు. వీరికి సుస్మిత(8), మోటు(6) ఇద్దరు పిల్లలు ఉన్నారు. నెల కిందట తన ఇద్దరు పిల్లలతో కలిసి నిషా.. మేల్‌మరవత్తూరు ఆలయానికి వెళ్లింది. తర్వాత ఢిల్లీలోని తన తల్లిదండ్రుల వద్దకు వెళ్లిపోయింది. తన భార్యను పంపాలని పెద్దల సాయంతో కిరణ్ ప్రయత్నించినా ప్రయోజనం లేకపోయింది. ఈ నేపథ్యంలో శనివారం మోటు(6) మృతి చెందినట్లు వీడియో కాల్ ద్వారా తమకు తెలియపరిచారని కిరణ్ తెలిపాడు. నా బిడ్డను వారే చంపేశారని ఆరోపించాడు. కుమార్తెనైనా ప్రాణాలతో అప్పగించేలా చూడాలని కోరాడు. బిడ్డ మృతికి కారకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాకపోకలకు అంతరాయం కల్గడంతో పోలీసులు అక్కడికొచ్చి విచారించి, న్యాయం చేస్తామని నచ్చచెప్పడంతో వారు ఆందోళన విరమించారు.


రహదారిపై నిరసన తెలుపుతున్న కిరణ్ కుటుంబీకులు